Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 171 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 జూలై 2023 బుధవారం పేజీలు : 4

## ఉత్తరాదిలో ఆగని వర్ష బీభత్సం

న్యూఢిల్లీ : భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో ఉత్తరాది రాష్ట్రాలు గజగజ వణికిపోతున్నాయి. వర్ష బీభత్సంతో గత మూడు రోజుల్లో వేర్వేరు ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 37కు చేరింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా, జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, యూపీ, ఢిల్లీలో మరో రెండు రోజులు కుండపోత వానలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ రాష్ట్రాల్లో యమునతో పాటు ఇతర నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు పట్టణాలు, నగరాలు జలమయమయ్యాయి. సహాయ చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఆర్మీని రంగంలోకి దింపారు. హిమాచల్‌లో పరిస్థితి భయానకంగా ఉంది. వరద ఉధృతి, కొండచరియలు విరిగిపడి ఇళ్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల దుకాణాలు, వాహనాలు వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి.

# 20 ఏళ్ల తర్వాత మళ్లీ 'ఫ్రీ పవర్' మంటలు

## రేవంత్ వర్సెస్ బిఆర్ఎస్



హైదరాబాద్ : అది ఉమ్మడి ఏపీ లో 2003-04 కాలం. అప్పటికి పదేళ్లుగా టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. 2002 నుంచి చంద్రబాబు పాలన లో కరువు నెలకొంది. రైతు ఆత్మహత్యలు విపరీతంగా చోటుచేసుకున్నాయి. ఇదే సమయం లో 2000లో విద్యుత్తు చార్జీల ను చంద్రబాబు ప్రభుత్వం విపరీతంగా పెంచింది. దీనిని ప్రతిపక్ష కాంగ్రెస్ అందిపుచ్చుకుంది.

అధికారం లోకి వస్తే రైతుల కు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని చెప్పింది. కాంగ్రెస్ పాలన లో అసలు కరెంటే ఉండదని.. అలాచేస్తే తీగలపై దుస్తులు ఆరేసుకోవా ల్సి వస్తుందని టీడీపీ ఎద్దేవా చేసింది. కానీ 2004 ఎన్నికల కు వచ్చేసరికి కాంగ్రెస్ ను ఉచిత విద్యుత్తు హామీనే అధికారం లోకి తెచ్చింది. అయితే తాజాగా మళ్లీ ఉచిత విద్యుత్తు అంశం తెరపైకి వచ్చింది.

**రేవంత్ ఏమన్నారు..? :** టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. అక్కడి తెలుగువారి సభల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రవాసులు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా పై ప్రశ్నలు అడిగారు. దీనికి స్పందిస్తూ తాము అధికారంలోకి వస్తే 8 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదిప్పుడు రాజకీయాల్లో దుమారం రేపుతోంది. ఒక ఎకరానికి నీళ్లు పట్టాలంటే ఒక గంట సరిపోతుంది.. అలాంటప్పుడు నిరంతరం విద్యుత్తు ఎందుకని ఆయన మాట్లాడార ని చెబుతూ బీఆర్ఎస్ మండిపడుతోంది. రేవంత్ వ్యాఖ్యల ను సొంత పార్టీ నేతలు కూడా తప్పుబడుతున్నారు. ఇవి పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే అధికార పార్టీ నేతలు మంత్రులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పై విరుచుకుపడుతున్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతుల మేలు గురించి ఆలోచించదని ధ్వజమెత్తుతున్నారు. ఇక ఉచిత విద్యుత్ అంశం పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పై తెలంగాణ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే 8 గంటలు మాత్రమే విద్యుత్తు ఇస్తామని ఆయన చేసిన వ్యాఖ్యల కు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా మంగళ బుధవారాల్లో నిరసనల కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ప్రతి గ్రామం లో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మలు దహనం చేయాలని సూచించింది. ఉచిత విద్యుత్ ను రద్దు చేయాలన్న దుర్మార్గ ఆలోచన కాంగ్రెస్ పార్టీది అని మంత్రి కేటీఆర్ అన్నారు. విద్యుత్ ఇవ్వకుండా గతంలో రైతుల ను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ దని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి ఆ విధానాల ను బయటపెట్టుకుందని అన్నారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ రైతాంగం ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ లో రేవంత్ ప్రత్యర్థి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం స్పందించారు. ఆయన మాటలు వ్యక్తిగతమైనవని అన్నారు. రేవంత్ చెబితే అది అంతిమం కాదని.. తమ పార్టీకి ఒక సిద్ధాంతం ఉంటుందని చెప్పారు. కాగా కోమటిరెడ్డి స్టార్ క్యాంపెనర్. ఆ హోదాలో తాను చెబుతున్నాన ని 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. తాను రేవంత్ పార్టీ సమన్వకర్తలు మాత్రమేనని చెప్పిన ఆయన సీఎం ఎవరు అనేది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని.. మేనిఫెస్టో లో కూడా పెడతామని చెప్పారు. రేవంత్ అప్పట్లో కాంగ్రెస్ లో లేరు కాబట్టి ఉచిత విద్యుత్తు హామీ అమలు కు ఎంత కష్టపడ్డామో ఆయన కు తెలియదన్నారు. రేవంత్ గనుక ఉచిత విద్యుత్తు వద్దు అంటే అది తప్పేనని అన్నారు. మరోవైపు మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ఉచిత విద్యుత్తు ఇస్తే ఎందకంత మంట అని నిలదీశారు.

## రాష్ట్రంలో నేటి నుంచి 5 రోజులు వానలు

హైదరాబాద్ : తెలంగాణలో చాలాచోట్ల బుధవారం నుంచి ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు పడవచ్చని పేర్కొంది. ఉత్తర తమిళనాడు తీరంలోని నైరుతి



బంగాళాఖాతంలో సోమవారం ఆవర్తనం ఏర్పడి సగటు సముద్ర మట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వద్ద కొనసాగుతున్నట్లు తెలిపింది. దిగువ స్థాయిలోని గాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్నాయని వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం జిల్లా వేంసూరులో 56 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లా కేశవరంలో 18.3, ఖమ్మం జిల్లా పంగిడిలో 11.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 11 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ఈసారి దక్షిణాది నుంచి మోడీ పోటీ ?

### సేఫ్ నియోజకవర్గం కోసం బీజేపీ అన్వేషణ !

కేంద్రంలో వరుసగా రెండుసార్లు విజయాలు సాధించడంతో పాటు దేశవ్యాప్తంగా ఈ తొమ్మిదేళ్లలో పలు కీలక రాష్ట్రాల్లో విజయాలు సాధించిన బీజేపీకి తాజాగా వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఎన్నో ఆశలు పెట్టుకున్న కర్నాటక ఎన్నికల్లో ఓటమిపాలైన బీజేపీకి అంతకు ముందు హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో రెండు రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరిగే ఛత్తీస్ ఘడ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా కాంగ్రెస్ పార్టీకి జై కొట్టేలా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీతో అంతర్మథనం మొదలైంది. నిన్న జరిగిన బీజేపీ ప్రాంతీయ సంప్రదింపుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా దక్షిణాది రాష్ట్రాల పార్టీ అధ్యక్షులకు కీలక ఆదేశం ఇచ్చారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మంది ఎంపీల్ని దక్షిణాది నుంచే ఎన్నికయ్యేలా చూడాలని ఆదేశించించారు.

ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, గోవా, పుదుచ్చేరి, అండమాన్ – నికోబార్‌ల ఇన్‌ఛార్జ్‌లు ఉన్నారు. కర్నాటకలో బీజేపీ ఓటమి ప్రభావం దక్షిణాదిలోని మిగతా రాష్ట్రాలపై పడుతుందన్న అంచనాకు వచ్చిన బీజేపీ అధిష్టానం.. అలా జరగకుండా చూడాలని పార్టీ రాష్ట్రాల అధ్యక్షుల్ని ఆదేశించింది. అలాగే 2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ దక్షిణాది నుంచి పోటీ చేసే అవకాశం ఉందని కూడా సంకేతాలు ఇచ్చింది. దక్షిణాదిలోని ప్రజలకు చేరువయ్యేందుకు వీలుగా ప్రధాని మోడీ ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశం ఉందని అధిష్టానం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రధాని



మోడీని దక్షిణాదిలోని ఏ రాష్ట్రం నుంచి పోటీ చేయించాలనే దానిపై బీజేపీ కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కర్నాటకలోని బెంగళూరు సిటీలో ఉన్న ఎంపీ సీట్లలో కానీ, తెలంగాణలోని సికింద్రాబాద్ వంటి సీటు నుంచి కానీ, లేదా తమిళనాడు నుంచి కానీ పోటీ చేయించేందుకు అన్వేషణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కసరత్తు త్వరలో పూర్తి చేసి మోడీ పోటీ చేసే నియోజకవర్గాన్ని ముందే ప్రకటించేందుకు బీజేపీ హైకమాండ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# రేవంతుడి స్కెచ్ అదిరిందిగా!

## కాంగ్రెస్ గెలిస్తే సీతక్కే సీఎం..

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ప్రకటన వెనుక ఉన్న వ్యూహం అదేనా?




హైదరాబాద్ : కాంగ్రెస్‌లో కుర్చీలాట మ్యూజికల్ చైర్‌ను తలపిస్తున్నది. ఆలు లేదు చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం.. అన్న చందంగా అప్పుడే ముఖ్యమంత్రిగా ఎవరు? అనే పంచాయితీ మొదలైంది. పార్టీలో అప్పుడే ఒకరికి ఒకరు చెక్ పెట్టుకునే దిశగా ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి చెక్ పెట్టడానికి సీఎం అభ్యర్థిగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను పార్టీలో సీనియర్లు తెరపైకి తీసుకురాగా, ప్రతిగా భట్టికి చెక్ పెట్టడానికి సీతక్కను రేవంత్‌రెడ్డి తెరపైకి తీసుకువచ్చారు. భట్టి దళిత నేత కాగా సీతక్క గిరిజన నేత. దళితుడికి పోటీగా గిరిజన నేత సీతక్కను తెరపైకి తీసుకరావడం ద్వారా పార్టీలో అటు సీనియర్లకు, ఇటు భట్టికి చెక్ పెట్టినట్టుగా ఉంటుందన్నది రేవంత్‌రెడ్డి వ్యూహం అని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రను రేవంత్‌రెడ్డి వ్యతిరేక శిబిరం తమకు అనుకూలంగా మార్చుకున్నది. ఈ యాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం సభలో భట్టిని రాహుల్ గాంధీ అభినందించారు. ఈ సభను పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా ఏర్పాటు చేశారు. రేవంత్‌రెడ్డి వ్యతిరేక వర్గీయులు దీనిని భట్టి అభినందన సభగా మార్చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం పదవి దళితుడైన భట్టికే దక్కుతుందన్న ప్రచారాన్ని రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించే నాయకులు బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

దీనిని తిప్పికొట్టేందుకు రేవంత్‌రెడ్డి వేసిన పాచికగా సీతక్క పేరును తెరపైకి తెచ్చి ఉంటారని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికాలో 'తానా' సభ వేదికగా సీఎం అభ్యర్థిగా సీతక్క పేరును రేవంత్‌రెడ్డి ప్రకటించడం పార్టీలో సీనియర్లకు మింగుడు పడటం లేదు. రేవంత్ చేసిన ప్రతిపాదన భట్టికి చెక్ పెట్టడానికేనని పార్టీలో కొందరు నాయకులు అభిప్రాయపడుతుండగా, టీడీపీ నుంచి తన వెంట కాంగ్రెస్‌లోకి వచ్చిన సీతక్క అయితే తాను చెప్పినట్టు వింటుందన్నది ఆయన ఎత్తుగడ కావచ్చని ఇంకొందరు విశ్లేషిస్తున్నారు. మొత్తం మీద సీతక్క పేరును రేవంత్‌రెడ్డి తెరపైకి తీసుకురావడంతో కాంగ్రెస్‌లో ఇంకో కొత్త పంచాయితీ రాజుకున్నట్టు అయింది.

# సంపాదకీయం

## రాహుల్ తో కాంగ్రెస్ జోష్ పెరుగుతోందా ?

రాహూల్ గాంధికి నిక్ నేమ్ పప్పు. ఈ పేరు దేశవ్యాప్తంగా చాల పాపులర్. రాహుల్ కు ఈపేరు ఎందుకొచ్చిదంటే తన వ్యవహార శైలివల్లే అని చెప్పాలి. ఎంతోగొప్ప గాంధీ కుటుంబం నుండి వచ్చినా అందుకు తగ్గట్లుగా వ్యవహరించేవారు కాదు. రాజకీయంగా ఆనాసక్తి ఏ విషయంలోను సీరియస్ ఉండకపోవటం సభల్లో ఎంత గంభీరంగా మాట్లాడినా చివరకు ఏదో పనికిమాలిన మాటలు మాట్లాడి అప్పటివరకు మాట్లాడిన మాటల్లోని సీరియస్ నెస్ ను తానే తగ్గించయటం లాంటి చేష్టలు చేసేవారు. అందుకనే రాహుల్ ను పప్పు అనేవారు. సీన్ కట్ చేస్తే కొద్దిరోజులుగా రాహెల్ వ్యవహారశైలిలో బాగా మార్పు కనబడుతోంది. తాజాగా హర్యానా పర్యటనలో సోనేపట్ లో పొలంలోకి దిగి ట్రాక్టర్ తో పొలాన్ని దున్నారు. ఢిల్లీ నుండి సిమ్లాకు బయలుదేరిన రాహుల్ మధ్యలో సోనెపట్ లో ఆగారు. మార్గమధ్యలో ఇలా చాలాచోట్ల రాహుల్ ఆగిపోయి ప్రజలతో మమేకమయ్యారు. ఒకవిధంగా చెప్పాలంటే భారత్ జోడోయాత్రతోనే రాహూల్ స్టైల్ మారిపోయిందనే అనుకోవాలి. కన్యాకుమి నుండి కాశ్మీర్ దాకా జరిగిన భారత్ జోడోయాత్రలో రాహుల్ కొన్ని వేలమందితో ఇంటరాక్టయ్యారు. మార్గమధ్యలోని గ్రామాలు పట్టణాలు నగరాల్లో పాదయాత్ర చేస్తు మామూలు జనాలతో మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను కూడా ప్రజల్లో ఒకడిగా కలిసిపోయారు. కొన్ని నెలలపాటు ప్రజల్లో తిరగటంతో రాహుల్ పైన పడిన పప్పు అనే ముద్ర కొంతవరకు తొలగిందనే చెప్పాలి. ఇదే సమయంలో మార్గమధ్యలోని సభల్లో మాట్లాడుతు నరేంద్రమోడీ ప్రభుత్వంపై పదునైనా విమర్శలు ఆరోపణలు చేయటంతో రాజకీయాల్లో రాహుల్ సీరియస్ అయ్యారని అర్థమైంది. జోడోయాత్రలోనే కర్నాటకలో చేసిన పాదయాత్ర ప్రభావం మొన్నటి ఎన్నికల్లో పాజిటివ్ గా కనబడింది. అలాగే ఎన్నికల్లో భాగంగా ప్రచారం కోసం రాహుల్ బాగా సీరియస్ గా ప్రచారంచేశారు. ఇంత సీరియస్ గా గతంలో ఏ ఎన్నికల్లోను రాహుల్ ప్రచారం చేయలేదు. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపోటములను పక్కనపెట్టేస్తే రాహుల్ లో పరిణతి చెందిన నేత కనిపిస్తున్నారు. ఇదే పద్దతిని కంటిన్యుచేస్తే తొందరలోనే దేశంలోని ముఖ్యమైన నేతల్లో రాహుల్ కీలక స్థానం సంపాదించుకోవటం ఖాయం.

# అంతటా అవినీతి.. ఏసీబీ జాడేది?



ఆదిలాబాద్ : అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో చేతివాటం లేకుండానే వాహనాలను పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒక్క రూపాయి తీసుకోకుండానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. పర్సంటేజీలు తీసుకోకుండానే ఇంజినీర్లకు బిల్లులు చేసి ఇస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు వారినుంచి ఏమి ఆశించకుండా తమకు వచ్చే నెల వేతనంతోనే సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరూ లంచం అడగడం లేదు. ఏంటి? అంతా మారిపోయింది. స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా అవినీతి రహిత సమాజం ఏర్పడుతోందని అనుకుంటున్నారా? అలా అయితే మీరు పప్పులో కాలేసినట్లే.. ఎందుకంటే అవినీతి నిరోధక శాఖ అధికారుల కేసుల సంఖ్యను చూస్తే ప్రభుత్వం యంత్రాంగమంతా ఏతప్పు చేయకుండా ఉందనిపిస్తోంది. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. కొంతకాలంగా ఆ శాఖాధికారుల దాడులు చేయకుండా చేతులుముడుచుకుని కూర్చున్నారు..ప్రభుత్వ శాఖల్లో అవినీతిని రూపుమాపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొద్దికాలంగా క్రియారహితంగా మారిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన కార్యాలయం ఆదిలాబాద్ పట్టణంలో ఉంది. డీఎస్పీ స్థాయి అధికారి ఉండే ఈ కార్యాలయంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆదిలాబాద్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ఎవరైనా లంచం అడిగితే ఈ శాఖ ఫిర్యాదు స్వీకరిస్తుంది. ఆ తరువాత డబ్బులు తీసుకునే సమయంలో దాడిచేసి కేసులు నమోదు చేస్తుంది. ఈ కేసులను ట్రాప్ కేసులంటారు.

ఫిర్యాదు రాకున్నా..ఎలాంటి ఫిర్యాదు రాకున్నా ఎవరైనా అధికారి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారని తెలిస్తే ఈ శాఖాధికారులు దాడులు చేస్తారు. ఆదాయానికి మించి ఆస్తుల (డీఏ) కేసులే ఈ శాఖపనితీరుకు గీటురాయి. జిల్లాలో ఏటా ఇలాంటి ఒక కేసుతోనే సరిపెడుతున్నారు. ఒక్కో ఏడాదైతే అదిసైతం నమోదు కావడంలేదు.

మునుపటి ప్రచారం ఏది?

అవినీతి అంతంపై ఈ శాఖ విస్తృతంగా ప్రచారం చేయాలి. అన్నిశాఖల కార్యాలయాల వద్ద గోడప్రతులు అతికించాలి. డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలని చరవాణి నంబర్లు ప్రదర్శించాలి. తరచు కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. కానీ కొంతకాలంగా పూర్తి స్తబ్ధత నెలకొంది.

అవినీతి జడలు విప్పుతున్నా..అన్ని శాఖల్లో అవినీతి జడలువిప్పుతున్నా ఏసీబీ మాత్రం జఢత్వం వీడటంలేదు. కొన్నిశాఖల్లో ఇంజినీర్లైతే రూ.కోట్లకు పడగలెత్తారు. పనుల్లో నాణ్యతను గాలికొదిలేసి స్వలాభం చూసుకుంటున్నారు. మరికొందరు రవాణాశాఖ అధికారుల ఆదాయానికి హద్దులేదనేది బహిరంగ రహస్యం. కొందరు రెవెన్యూ శాఖాధికారులు రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ప్రైవేటు వ్యక్తులపరం చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. కొందరైతే పేదల సంక్షేమం పేరిట వచ్చిన డబ్బులను మింగేస్తున్నారు. అమాయక రైతులను లంచం పేరిట వేధిస్తున్నారు. పత్రికల్లో వీటిపై తరచూ వార్తలు కూడా వస్తున్నాయి. అయినా వారిపై అనిశా ఎందుకు దృష్టిపెట్టడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది ఒకటే..ఈ ఏడాది అనిశా దాడులు తగ్గుముఖం పట్టాయి. ట్రాప్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. మే 24న నిర్మల్ జిల్లాలో ఒక తహసీల్దార్‌పై ఆదాయానికి మించి ఆస్తులున్నాయని దాడులు చేశారు. 2022లో ఈ ఒక్క కేసు మాత్రమే నమోదైంది.

అధికారి వివరణ..ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ భద్రయ్యను సంప్రదించగా.. ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో వారికి సంబంధించి పూర్తి వివరాలపై కసరత్తు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకనే ఈ కేసుల సంఖ్య తక్కువగా ఉంటుందన్నారు. ఎవరైనా సమాచారమిస్తే ఆ అధికారుల పని పడతామని పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా లంచం అడిగితే ఆదిలాబాద్‌లోని గాంధీపార్కు వెనుకాల ఏసీబీ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు. తన చరవాణి నం.94404 46166కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చని వివరించారు.

# ఏళ్ల కష్టం.. నీళ్లపాలు

మంచిర్యాల : రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారం దరిది.. ఓ పూట కడుపు మాడ్చుకుంటూ, పైసాపైసా కూడబెట్టుకుంటూ ఇంట్లో ఈ వస్తువు లేదు అనే మాటే రాకుండా ఉన్నదాంట్లోనే ఉన్నతంగా జీవిస్తున్నారు. వీరిని చూసి వరుణుడికి కన్నుకుట్టిందో ఏమో.. భారీ వర్షాలతో వరదలను తీసుకొచ్చాడు.. ఒక్కరాత్రిలోనే వారి జీవితాలు నీటి పాలయ్యేలా చేశాడు. వారి బతుకులను మళ్లీ మొదటికి తీసుకొచ్చాడు. వారు చేసేది చిరుద్యోగం.. నెలకు వచ్చేది ఎనిమిదివేలు. ఈ సంపాదనతో ప్రస్తుతం కుంటుంబాన్ని ఎలా పోషించేది.. చెడిపోయిన సామగ్రిని తిరిగి ఎలా సంపాదించుకునేది. ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఇలాంటి నిరుపేదలు ఇంకా కోలుకోలేకపోతున్నారు.ఇటీవల వచ్చిన వరదలతో భారీ నష్టం జరిగింది. సుమారు 12 కాలనీ (పాతమంచిర్యాల, గణేష్‌నగర్, మేదరివాడ, పద్మశాలికాలనీ, ఎల్‌ఐసీకాలనీ, రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, కాలేజిరోడ్, లేబర్‌కాలనీ, బాలాజీనగర్, రాళ్లపేట తదితర కాలనీలు)ల్లో 2270 నివాసాలు వరదలో మునిగినట్లు తేల్చారు. ఆయా గృహాల్లో మొత్తం రూ.15 కోట్ల విలువైన సామగ్రి చెడిపోయినట్లు సమాచారం.

ఒక్కో రూపాయి కూడబెట్టి..పాతమంచిర్యాలకు చెందిన శ్రీనివాస్.. జీజీహెచ్ ఆసుపత్రిలో రోగి సంరక్షుడి (పారిశుధ్య విభాగానికి చెందిన గుత్తేదారుడి దగ్గర)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి వచ్చే వేతనం రూ.7–8వేలు. ఈ జీతంతోనే కుటుంబాన్ని పోషించాలి. అయినా ఉన్నంతలోనే ఒక్కో రూపాయి జమచేసుకుంటూ చిన్నపాటి సొంత నివాసాన్ని నిర్మించుకున్నారు. కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసుకుని బతుకుతున్నారు. కానీ రాత్రికి రాత్రే వరద తన ఇంటిని ముంచెత్తి అల్లకల్లోలం చేసింది. టీవీ, ఫ్రిజ్, కూలర్ ఇలా ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోవడంతో పాటు నిత్యావసర సామగ్రి వరదల్లో కొట్టుకుపోయింది. సుమారు రూ.70వేలు నష్టం వచ్చిందని, మళ్లీ కోలుకోవాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో కూడా చెప్పలేనంటున్నారు శ్రీనివాస్.

కన్నీటిని మిగిల్చిఎన్టీఆర్ నగర్‌కు చెందిన శ్రీనివాస్ ధర్మాసుపత్రిలో భద్రతా విభాగంలో పనిచేస్తున్నారు. వేతనం తక్కువైనా ఉన్నదాంట్లోనే సర్దుకుంటూ ఇంట్లోకి కావాల్సిన విలువైన సామగ్రితో పాటు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచుకున్నారు. ఇటీవల వచ్చిన వరదలు అతన్ని మళ్లీ మొదటికి తీసుకొచ్చాయి. నివాసం నీటిలో మునిగిపోవడంతో ఎలక్ట్రానిక్ సంబంధించిన ఏ ఒక్క వస్తువు కూడా వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. చిరుద్యోగిగా కష్టపడి సంపాదించుకున్న వస్తువులన్నీ వరదపాలయ్యాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు శ్రీనివాస్. రూ.లక్ష వరకు నష్టం రాగా తిరిగి కొనుగోలు చేసే పరిస్థితి కూడా ఇప్పట్లో కనిపించడంలేదంటున్నారు.

నిల్వ ఉంచిన బియ్యం తడిసె..సత్తు సంపత్–మమత స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముంటున్నారు. సంపత్ భవన నిర్మాణానికి చెందిన సెంట్రింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వరదలు తన కాలనీని ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయారు. సాఫీగా సాగుతున్న తన జీవితానికి ఈ విపత్తు అడ్డంకిగా మారింది. వరదనీరు ఇంటిని ముంచడంతో ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే కొనుగోలుచేసి నిల్వ ఉంచుకున్న బియ్యం నీళ్లపాలయ్యాయి. వీటితో పడకలు, సిలిండర్లు, దుస్తులు ఇలా నిత్యావసరాలన్నీ వరదపాలయ్యాయి. సుమారు రూ.90వేల విలువ చేసే వస్తువులు కొట్టుకుపోయాయని, తిరిగి సంపాదించాలంటే మూడు, నాలుగేళ్లు పడుతుందని మమత ఆవేదనతో చెప్పుకొచ్చారు.

సర్దుకునే అవకాశంలేక..పాతమంచిర్యాల నివాసి అయిన అశోక్.. జీజీహెచ్ ఆసుపత్రిలో పారిశుధ్య గుత్తేదారు కింద రూ.8వేల వేతనానికి ఎంఎన్‌ఓగా పనిచేస్తున్నారు. రాళ్లవాగు ఉప్పొంగడంతో ఇతని నివాసం నీటిలో మునిగిపోయింది. రేకులతో నిర్మించిన గృహం కావడం, ముందస్తు సామగ్రిని భద్రపరుచుకునే అవకాశం లేకపోవడం, రాత్రికి రాత్రే నీరు కాలనీని చుట్టుముట్టడంతో ఏమీ చేయాలో తోచక వదిలిపెట్టి వెళ్లారు. వస్తువులను వరదపాలు చేశారు. టీవీతో పాటు పడకలు, నిత్యావసర వస్తువులు, సరకులు, దుస్తులు మొత్తం నీటిలో తడిసిముద్దయ్యాయి. చాలీ చాలని వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా ఈ వరదలతో వచ్చిన రూ.60 వేల నష్టంతో మరింత ఇబ్బందికర పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు అశోక్.

# మురుగుశుద్ధి వైపు ముందడుగు



మంచిర్యాల : ఖానాపూర్ చెరువులోకి సమీప ఇళ్ల నుంచి మురుగు వచ్చి చేరడంతో నీరంతా కలుషితమవుతోంది. పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. భూగర్భ జలాలు తాగేందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం కానుండటంతో కాలుష్యం తగ్గిపోనుంది.ఆదిలాబాద్ పట్టణంలో నిత్యం ఇళ్ల నుంచి వచ్చే మురుగు కాలువల నుంచి నేరుగా వాగులు, చెరువుల్లోకి చేరుతోంది. దీంతో అందులోని నీరు కలుషితం కావడంతోపాటు జలచరాలకు ముప్పు ఏర్పడుతోంది. భూగర్భ జలాలు సైతం కలుషితమైపోయి తాగడానికి పనికిరాకుండా పోయే పరిస్థితి తలెత్తుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మురుగు నీటి శుద్ధి కేంద్రాల(సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్–ఎస్‌టీపీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్ర పథక స్వరూపాన్ని (డీపీఆర్) పంపాల్సిందిగా ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఎస్‌కే అసోసియేషన్ అనే ప్రైవేటు సంస్థ.. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ, బల్దియా అధికారుల సమన్వయంతో డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా.. కేంద్రం వాటా 33శాతం వ్యయాన్ని, రాష్ట్రప్రభుత్వం, బల్దియా వాటా కలిపి 67శాతం నిధులను ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేయనున్నారు.

పట్టణంలో ఎస్టీపీని ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేసిన ప్రాంతంలో ప్రత్యేకంగా భూగర్భ పైప్‌లైన్ వేస్తారు. కాలనీలోని అన్ని ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలను పైప్‌లైన్‌కు అనుసంధానం చేస్తారు. అలా వచ్చిన మురుగును ఎస్టీపీకి మళ్లించి శుద్ధీకరణ ప్రక్రియ చేపడతారు. రసాయనాలను కలిపి అందులోని మలినాలను, హానికారక జలాలను తొలగించి శుద్ధి చేస్తారు. ఆ తర్వాతే నీటిని సమీప వాగులు, చెరువుల్లోకి వదులుతారు. దీంతో నీటి వనరులు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. ఎస్టీపీలు ఏర్పాటైన చోట ఎలాంటి దుర్వాసన ఉండదని, భవిష్యత్తులో పట్టణానికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ ఎస్టీపీలను అనుసంధానం చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

అయిదు చోట్ల ఏర్పాటుకు నిర్ణయం..

పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అయిదు చోట్ల ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఖానాపూర్, సుభాష్‌నగర్, చిల్కూరి లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, కేఆర్కే కాలనీలో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇటీవలే అధికారులు సర్వే చేశారు. భౌగోళికంగా ఎత్తు నుంచి పల్లం వైపు మురుగు ప్రవహించే చోట వీటి నిర్మాణానికి అనువైన బల్దియా, రెవెన్యూ స్థలాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని అన్వేషిస్తున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి రాగానే ఎంత సామర్థ్యంతో నిర్మించాలి. అందుకు ఎన్ని కిలోమీటర్ల పైప్‌లైన్ వేయాల్సి ఉంటుంది.. వంటి పూర్తి వివరాలతో డీపీఆర్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రభుత్వం ఆమోదించగానే క్షేత్రస్థాయిలో నిర్మాణానికి బాటలు పడతాయి.

మురికివాడలకు మేలు : జోగు ప్రేమేందర్, పురపాలక అధ్యక్షుడు

మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంతో మురికివాడలకు ఎంతో మేలు కలుగుతుంది. ఎంపిక చేసిన అయిదు ప్రాంతాల్లో పకడ్బందీగా డ్రైనేజీ వ్యవస్థ ఉంటుంది. రోడ్లపై మురుగు పారడం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు దూరమవుతాయి.

సర్వే జరుగుతోంది : హరిభువన్, ఏఈఈ, ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ

రాష్ట్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా ఎస్టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం బల్దియా అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్నాం. సర్వే పూర్తయ్యాక డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

# పెరుగుతున్న గోదారి.. ఆందోళనలో ప్రజలు

మంగపేట : గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. గతనెలలో సంభవించిన వరదలతో అతలాకుతలమైన ప్రజలు.. మళ్లీ వరద పెరుగుతుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. జాతీయరహదారిలోని పూసూరు–ముల్లెకట్ట హైలెవెల్ వంతెన వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువప్రాంతంలోని ప్రాజెక్టులు, ప్రాణహిత, ఇంద్రావతి గోదావరి ఉపనదుల నుంచి వస్తున్న వరదనీటితో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని టేకులగూడెం సమీపంలో జాతీయరహదారి ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు–గుమ్మడిదొడ్డి గ్రామాలమధ్య రహదారిపై కొంగాలవాగు వరద చేరింది. రెండురోజులుగా స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రి నుంచి వేగంగా పెరుగుతోంది. పేరూరులో మంగళవారం సాయంత్రం 6 గంటలకు 47.39 అడుగులకు (14.45 మీటర్లు) చేరుకుంది.

ఉప్పొంగిన వాగులుమండలంలోని వాగులకు గోదావరి వరద పోటెత్తింది. పెంకవాగు, కంకలవాగు, జిన్నెలవాగు, బల్లకట్టువాగు,




కుక్కతోగువాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీటి ప్రవాహం అధికం కావడంతో వాగులు ప్రమాదకరంగా మారాయి. వెంకటాపురం–మల్లాపురం మార్గ మధ్యలో కంకలవాగు ఉద్ధృతికి రాకపోకలు ఆగాయి. పెంకవాగు లోలెవల్ చప్టా వరద నీటి ముంపునకు గురైంది. ఆవలి ప్రాంతంలోని గిరిజనులు ప్రవాహంలోనే రాకపోకలు సాగించారు. ద్విచక్రవాహనాలను సైతం మోసుకొని వాగు దాటించుకున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహం అంతకంతకు పెరుగుతుండటంతో మళ్లీ కష్టాలు తప్పేలా లేవని గిరిజనం ఆందోళన చెందుతున్నారు.

# ఆసరాపై ఆశలు..

కామారెడ్డి : ఆసరా దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకుని పింఛన్ల కోసం మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్నవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల కొత్త దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. తెరాస ప్రభుత్వం రెండోసారి కొలువుదీరిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు.

ఇది వరకే వేలల్లోజిల్లాలో ఆసరా పథకం కింద తమకు వివిధ విభాగాల్లో పింఛన్లు మంజూరు చేయాలని ఇది వరకే 9,367 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతలను మండల, జిల్లాస్థాయి అధికారులు ధ్రువీకరించారు. ఇవికాకుండా రాష్ట్ర ప్రభుత్వం పింఛను వయస్సును 65 నుంచి 57 సంవత్సరాలకు తగ్గించింది. దీని కింద రెండు దశల్లో జిల్లావ్యాప్తంగా 29,162 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా డయాలసిస్



రోగులకు కూడా నెలకు రూ.2016 పింఛను అందజేస్తామని సీఎం ప్రకటించారు.

ఇదీ జిల్లా పరిస్థితి..జిల్లావ్యాప్తంగా అన్ని విభాగాల్లో 1.46 లక్షల మందికి ప్రతి నెల పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇందులో వృద్ధాప్య, వితంతు పింఛన్లే అధికంగా ఉన్నాయి. అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ఆలస్యం చేసింది. చివరిసారిగా 2018 జులైలో 2,500 మందికి మంజూరు చేశారు. ఆ తర్వాత ఊసే లేకుండా పోయింది.. ప్రతి నెల 300 నుంచి 500 దరఖాస్తు అందుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో తమకు ఇప్పటికైనా పింఛన్లు వస్తాయని భావిస్తున్నారు. కొత్తగా డయాలసిస్ రోగులకు కూడా అందే అవకాశాలు ఉన్నాయి. వయస్సు తగ్గించిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించలేదు. మరి మంజూరు చేస్తారా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఉత్తర్వులు రాగానే.. : – సాయన్న, డీఆర్డీవో, కామారెడ్డి

కొత్త పింఛన్ల మంజూరు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది. అన్ని విభాగాల్లో దరఖాస్తులు స్వీకరించాం. ప్రభుత్వ సూచన ప్రకారం ముందుకెళ్తాం.

# ధరలు పెరిగె.. మెనూ అమలు భారమాయె!

కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు గాడి తప్పుతోంది. పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు, బిల్లుల చెల్లింపుల జాప్యంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. ఈ విద్యాసంవత్సరంలో కొత్త మెనూను అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు అమలు కావడం లేదు. కోడిగుడ్ల ధరలు పెరగడంతో వాటిని విద్యార్థులకు పెట్టడం లేదు. ఉడికి ఉడకని అన్నం, రుచించని కూరలతో భోజనం చేసేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం అమలుపై పరిశీలన చేసింది.

పెండింగ్‌లో బకాయిలు...

జిల్లాలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దాదాపు 6 నెలల బిల్లులు, గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల రెండు, మూడు నెలల బిల్లులను విద్యా శాఖ మంజూరు చేసినా.. కార్మికులకు చేరలేదు. ప్రభుత్వం కార్మికులకు పెంచిన గౌరవ వేతనాలు అమలు కావడంలేదు. అప్పు చేసి వంట చేస్తున్నా బిల్లులు పెంచడం లేదన్నారు. జిల్లా విద్యాశాఖ వివరాల ప్రకారం గత ఏడాది నవంబరు–జనవరి వరకు కోడిగుడ్ల బిల్లు రూ.1.6 కోట్లు, భోజనం బిల్లులు గతేడాది మార్చి వరకు రూ.64.50 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబరు నుంచి కార్మికుల గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది.



ఇష్టారాజ్యమే....

జిల్లాలో పలు పాఠశాలల్లో వంట గదులు సరిపోక ఆరుబయట వంటలు చేస్తున్నారు. కట్టెల పొయ్యిలపై చేస్తున్న వంటతో అన్నం ఉడకడం లేదని, కడుపునొప్పి వస్తుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇక పెరిగిన ధరలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులతో కొత్త మెనూ అమలు చేయడంలేదని వంట కార్మికులు చెబుతున్నారు. రూ.5 చొప్పున కోడిగుడ్డు ధర ప్రభుత్వం చెల్లిస్తుండగా, మార్కెట్లో ప్రస్తుతం దాని ధర రూ.7 పలుకుతుందన్నారు. వాటిని కూడా అందించడంలేదని చెబుతున్నారు. కొత్త మెనూ ప్రకారం అన్నం, సాంబారు, మిక్స్‌డ్ విజిటేబుల్ కూర, కోడిగుడ్డు పెట్టాలి. పాత మెనూ ప్రకారం అన్నం, కోడిగుడ్డు, కూరగాయల కూర పెట్టాల్సి ఉంది. బడుల్లో వీటికి భిన్నంగా మెనూ ఉన్నట్లు తేలింది. తక్కువ ధరలో దొరికే ఒకే రకం కూరగాయలతో వంట చేయడంతో రుచించడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఆర్థిక భారం...కరీంనగర్‌లోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు విద్యార్థులకు అందించలేదు. కొత్త మెనూను అమలు చేయలేదు. మొత్తం హాజరైన 426 మంది విద్యార్థులకు వంకాయ కూరతో భోజనం పెట్టగా, రుచిగా లేదని, అన్నం ఉడక లేదని కొందరు పేర్కొన్నారు. కొందరు ఇళ్లక వెళ్లగా, మరికొందరు ఇంటి నుంచి తెచ్చుకున్న పచ్చడితో తిన్నారు. కొత్త మెనూ అమలుతో మరింత ఆర్థిక భారం పడుతుందని, ఈక్రమంలో దాన్ని అమలు చేయడం లేదని చెప్పారు. నిత్యావసర ధరలు పెరగడం, పాత బిల్లులే నెలల తరబడిగా రాని కారణంగా అప్పు చేసి భోజనం పెడుతున్నామని తెలిపారు.

# తీగల వంతెనపై భద్రత ఏదీ?

కరీంనగర్ : నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తీగల వంతెన ఆకతాయిలకు అడ్డాగా మారింది. కుటుంబంతోపాటు చూసేందుకు వచ్చిన వారికి ప్రశాంతత కొరవడుతోంది. కొందరు యువకులు శబ్దం వచ్చే బైక్‌లతో వంతెనపై చక్కర్లు కొడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు. కొందరు స్టంట్లు ప్రదర్శిస్తున్నారు. అక్కడ ఎలాంటి పోలీసు సిబ్బంది లేకపోవడంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. చాలామంది వంతెనపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. కొందరు సెల్ఫీల పేరుతో దారి పొడవునా వాహనాలు నిలుపుతున్నారు. 20కిపైగా ఐస్‌క్రీం బండ్లను వంతెనపై నిలుపుతున్నారు. భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. మానేరు జలాశయం వద్ద లేక్ అవుట్ పోస్టు ఏర్పాటు చేసి నిరంతరం గస్తీలో పోలీసులు ఉండడంతో సందర్శకులకు సమస్యలు ఎదురు కాలేదు. పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తే బొమ్మకల్ బైపాస్ గస్తీతోపాటు వంతెనపై రక్షణకు ఉపయోగకరంగా ఉంటుందని నగరవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని ఘటనలు ఇలా.. : నాలుగు రోజుల కింద ఓ కొత్త జంట



తీగల వంతెన చూడటానికి రాగా బైక్‌పై ముగ్గురు యువకులు వారి వాహనాన్ని ఢీకొట్టి వాగ్వాదానికి దిగారు. స్థానికులు వారించడంతో వారు అక్కడి నుంచి జారుకున్నారు.

వారం రోజుల కిందట కొందరు యువకులు సైలెన్సర్లను తొలగించి.. శబ్దం వచ్చేలా ద్విచక్ర వాహనాలతో వంతెనపై తిరుగుతూ సందర్శకులను భయభ్రాంతులకు గురి చేశారు.

త్వరలోనే అవుట్ పోస్టు ఏర్పాటుకొత్తగా నిర్మించిన తీగల వంతెన భద్రత కోసం త్వరలోనే పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తాం. సందర్శనపై ఎవరు దురుసుగా ప్రవర్తించినా, వాహనాలతో రైడింగ్ చేసినా కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. స్మార్ట్ సిటీ కింద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే భద్రతపరంగా ఉపయోకరంగా ఉంటుంది. ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ పోలీస్ కమిషనర్

# బడుల్లో సంస్కరణలు.. బాలల్లో ఉత్తేజం


కరీంనగర్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు బాలల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. వసతి సదుపాయాలతోపాటు బోధనలో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

కొత్త సదుపాయాలు..

జిల్లాలో మొదటి విడతగా మన ఊరు–మన బడి కింద 230 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి రూ.92.96 కోట్లతో పనులు చేపట్టారు. పనులు పూర్తైన 16 పాఠశాలలను మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. 97 పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లను అందించారు. తెరపై పాఠాల బోధనకే కాదు గ్రీన్ ఛాక్ బోర్డుగా ఇది ఉపయోగపడనుంది. బాలల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 5 వేల మందికి రాగిజావను పంపిణీ చేస్తున్నారు. 152 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కొత్తగా రూం టూ రీడ్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 435 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తోంది. వీటిని విద్యా దినోత్సవంలో ప్రారంభించనున్నారు.

పాఠ్య పుస్తకాలు.. దుస్తుల పంపిణీ

ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులకు అందించనున్నారు. జిల్లాలోని 651 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 38,475 మంది బాలలకు



వాటిని అందిస్తున్నారు. ఇప్పటికే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు బడులకు చేరగా, ఈ ఏడు నుంచి కొత్తగా అందిస్తున్న 70 వేల నోట్ పుస్తకాలు 5 మండలాల బడులకు పంపిణీ చేశారు.

ఉత్తమ అవార్డులతో సత్కారం నేడు జరిగే జిల్లా విద్యా దినోత్సవంలో పలువురిని ఉత్తమ అవార్డులతో సన్మానించనున్నారు. 10 జీపీఏ సాధించిన 10 మంది విద్యార్థులను, పది మంది ప్రధానోపాధ్యాయులను, 15 మంది ఉపాధ్యాయులు, అయిదుగురు ఎస్ఎంసీ ఛైర్మన్లు, అయిదుగురు తల్లిదండ్రులను, ఇద్దరు దాతలను సన్మానించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బడుల్లో జాతీయ పతాకావిష్కరణ, ర్యాలీలు, సాంస్కృతి కార్యక్రమాలు వంటి వాటిని నిర్వహిస్తున్నారు. విద్యాప్రగతిని వివరిస్తూ ఉపాధ్యాయులు వేడుకలను ఘనంగా నిర్వహించాలని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు.

# సిబ్బంది లేక ఇబ్బంది..

కొత్తగూడెం: జిల్లాలోని ప్రాంతీయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా వైద్యులు, సిబ్బంది, చికిత్స పరికరాలు అందుబాటులో లేకపోవడంతో వైద్యసేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకే రోగులను పరీక్షిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రిపూట సేవలందవు..!

భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిలో టిఫా స్కానింగ్ పరికరం మరమ్మతులకు గురైంది. గర్భిణులు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. రక్తశుద్ధి కేంద్రంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో డయాలసిస్ బాధితులకు సరైన వైద్యం అందటం లేదు. ఆరుగురు గైనకాలజిస్టులకు ప్రస్తుతం ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని గుమ్మడివల్లి, చంద్రుగొండ, ములకలపల్లి, ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు రాత్రిపూట వైద్యసేవలు అందటం లేదు. ఒక్కో దవాఖానాలో ఇద్దరేసి చొప్పున వైద్యులు ఉండాలి. అయితే ఒక్కొక్కరే విధులు నిర్వర్తిస్తుండటంతో ఈ సమస్య తలెత్తుతోంది.

శిథిలావస్థలో భవనాలు

ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో ఇప్పటికీ వైద్యసేవలందిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రోగులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. బూర్గంపాడు ప్రాంతీయ ఆసుపత్రి పురాతన భవనంలో కొనసాగుతోంది. ఇది 30 పడకల ఆసుపత్రి అయినప్పటికీ 15 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన పినపాక పీహెచ్‌సీ భవనం వానలకు కురుస్తోంది. నూతన భవన నిర్మాణం చేపట్టినా ఇంకా పూర్తికాలేదు. భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిలో రేడియాలజిస్ట్ లేకపోవటంతో టిఫా స్కానింగ్ పరికరాన్ని వినియోగించటం లేదు. బూర్గంపాడు ప్రాంతీయ ఆసుపత్రిలోని ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైంది. ప్రాంతీయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నూతన ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశించారు. నిధులు మంజూరు కాగానే ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.

# కాటన్ మరమగ్గాలకు మంచి రోజులు



సిరిసిల్ల: కాటన్ వస్త్ర పరిశ్రమ కష్టాలు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మరమగ్గాలుంటే.. వాటిలో జిల్లాలోనే 31 వేల పైన ఉన్నాయి. వీటిపై పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తులు వేర్వేరుగా జరుగుతాయి. ప్రభుత్వం సంక్షేమ పథకాల ఆర్డర్లు పూర్తిగా ఇక్కడికే కేటాయించడం, వాటిలోనూ పూర్తిగా పాలిస్టర్ ఉత్పత్తులే కావడంతో కాటన్ ఉత్పత్తులు కనుమరుగయ్యాయి. 20 వేలపైన కాటన్ మరమగ్గాల నుంచి 200కు పడిపోయాయి. వీటిలో చాలా వరకు తుక్కు కింద విక్రయించారు. 150 అద్దకం పరిశ్రమల్లో ప్రస్తుతం పది మాత్రమే మిగిలాయి. అవికూడా నెలలో సగం రోజులు పని లభించడం లేదు. వీటిపై ఆధారపడిన సుమారు 1500 మంది కార్మికులు క్రమంగా పాలిస్టర్ ఉత్పత్తుల వైపు వెళ్లారు. సిరిసిల్ల కాటన్ ఉత్పత్తులకు ఉమ్మడి రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్‌లలో మంచి డిమాండ్ ఉండేది. అలాంటి పరిశ్రమ కుదేలైంది. అన్ని రకాల వస్త్రోత్పత్తులు ఉంటేనే మనుగడ కొనసాగించడం సాధ్యం. దీని కోసం రూ.200 కోట్లతో వైద్య ఆరోగ్య శాఖకు అవసరమైన ఉత్పత్తుల ఆర్డర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

పరిశ్రమపై అధ్యయనం

జిల్లాలోని కాటన్ వస్త్రోత్పత్తులు, మరమగ్గాలు, అద్దకం, సైజింగ్ అనుబంధ రంగాలపై మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు చేనేత, జౌళిశాఖ బృందం అధ్యయనం చేసింది. వీటిపై ఎక్కువగా తెలుపు రంగు వస్త్రోత్పత్తులు జరగడం, పని చేసే కార్మికుల్లో ఎక్కువగా 70 ఏళ్లు పైబడినవారు ఉన్నారు. కుటీర పరిశ్రమగా ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి అయిదు సాంచాలు నడిపిస్తున్నారు. అద్దకం, సైజింగ్ పరిశ్రమలోనూ అదే పరిస్థితి. వీటికి అనుబంధంగా జూకీ మిషన్లతో వివిధ వస్త్రాలను ఆర్డర్ల మేరకు కుట్టడం, రవాణా, మార్కెటింగ్ వంటి రంగాలు ఉండేవి. ఇవన్నీ పూర్తిగా పాలిస్టర్, ఇతర రంగాలవైపు మళ్లాయి. పరిశ్రమను పూర్తిగా పాలిస్టర్ వస్త్రోత్పత్తులు ఆక్రమించాయి. భవిష్యత్తులో అనుకోని సంక్షోభం ఎదురైతే.. ఆ పరిస్థితులను తట్టుకునేలా ఇతర రంగాలను కూడా ప్రోత్సహించాలని నిర్ణయించారు. రెండు నెలల క్రితం రాష్ట్ర చేనేత, జౌళిశాఖలోని డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో అధికారుల బృందం చెన్నైలోని రాజపాల్యం గ్రామానికి వెళ్లింది.

దేశ వ్యాప్తంగా సరఫరా

రాజపాల్యంలోని వస్త్రోత్పత్తి పరిశ్రమ పూర్తిగా బ్యాండేజ్ (గాయాల కట్లకు) వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ తయారైన వివిధ రకాల బ్యాండేజ్ వస్త్రమే దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు సింహభాగం సరఫరా జరుగుతోంది. బ్యాండేజ్ ఉత్పత్తులకు వాడే నూలు, అద్దకం, సైజింగ్, ప్యాకింగ్ వంటి రంగాలపై వేలాది మంది ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వీరు ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని స్వయంగా మార్కెటింగ్ కూడా చేసుకుంటారు. వస్త్రం అవసరమున్న వ్యాపారులు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. మన రాష్ట్రం నుంచి వెళ్లిన అధికారుల బృందం నాలుగు రోజుల పాటు వారు ఉపయోగించే మరమగ్గాలు, వస్త్రోత్పత్తులు, మార్కెటింగ్ విధానాన్ని అధ్యయనం చేసింది. అక్కడి పరిశ్రమకు సిరిసిల్లలోని కాటన్ ఉత్పత్తులకు దగ్గరి పోలికలు ఉన్నాయి. దీని పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

రాష్ట్రానికి అవసరమయ్యేది...

జిల్లాలో ఇరవై వేలకు పైగా మరమగ్గాలపై నిత్యం 1.50 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తులు జరిగేవి. ఇప్పుడు వాటి సంఖ్య రెండు వందలకు పడిపోయింది. చిన్నపన్న (అడ్డంలో 36 ఇంచులు వస్త్రం వచ్చే) మరమగ్గాలు చాలా వరకు తుక్కు కింద విక్రయించారు. పెద్దపన్నవి చీరల ఉత్పత్తులకు అప్‌గ్రేడ్ చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన బ్యాండేజ్ వస్త్రాన్ని పూర్తిగా ఇక్కడే ఉత్పత్తి చేయించాలని నిర్ణయించారు. వీటిపై అవగాహనకు ఆసాములు, కార్మికులు, అద్దకం, సైజింగ్, ప్యాకింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు.

తుది దశలో ప్రణాళిక

కాటన్, దాని అనుబంధ రంగాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రణాళికలు చేస్తున్నాం. బ్యాండేజ్ వస్త్రం ఆర్డర్ల తుది నివేదిక ప్రభుత్వం వద్ద ఉంది. దశల వారీగా రాష్ట్రానికి అవసరమైన పూర్తి వస్త్రాన్ని ఇక్కడే తయారు చేయిస్తాం. దీనికి ముందు వస్త్రోత్పత్తిదారులు అనుబంధ రంగాల వారిని రాజపాల్యం తీసుకెళ్తాం. తర్వాత ఆర్డర్లు కేటాయించేందుకు ప్రణాళికలు చేస్తున్నాం. వీటితోపాటు వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో ఉపయోగించే దుప్పట్లు, ఇతర వస్త్రాల ఆర్డర్లను కేటాయించాలని మంత్రి హరీశ్‌రావుతో సంప్రదించాం. రైల్వేలోని ఉద్యోగులు, కార్మికుల అవసరాలకు ఉపయోగించే వస్త్రం కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. గూడూరి ప్రవీణ్, తెలంగాణ మరమగ్గాలు, జౌళి అభివృద్ధి సంస్థ ఛైర్మన్

# వసతులు కరవు.. విద్యార్థులకు చదువులు బరువు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కునారిల్లుతోంది. కనీస వసతులు కరవవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పేదలకు ఉచిత విద్య అందిస్తున్న ఏకైక కళాశాల అభివృద్ధి, వసతుల కల్పనపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇరవై సంవత్సరాల క్రితం ప్రారంభమై, మారుమూల ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ కళాశాల ఆధునికీకరణను ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. ఫలితంగా ఇరుకు గదులు, అరకొర వసతుల నడుమ విద్యార్థులు చదువులను నెట్టుకొస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి 1999లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో సుమారు 90 మంది, ప్రథమ సంవత్సరంలో 70 మంది విద్యార్థులున్నారు. ప్రవేశాలు కొనసాగుతుండటంతో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రైవేటు కళాశాలల నుంచి పోటీని తట్టుకొని మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ సంవత్సరం విడుదలైన పరీక్ష ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో బి.అజయ్‌కుమార్ (బైపీసీ) 925, జె.అఖిల (సీఈసీ) 925, సీహెచ్.శ్రీలత (సీఈసీ) 895, ప్రవళిక (ఎంపీసీ) 807 మార్కులు పొందగా ప్రథమ సంవత్సరం సీఈసీలో పి.దేవిక 807 మార్కులు సాధించింది. సిద్ధు అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో 7,343 ర్యాంకు పొందాడు.

గదుల కొరతతో...కళాశాలలోని రెండు భవనాలకు గాను ఒకదానిలో కార్యాలయం, స్టాఫ్‌రూం, రసాయనశాస్త్ర ప్రయోగశాల ఉండగా మరో భవనంలోని మూడు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల కిందట నిర్మించిన రేకులషెడ్డులోని రెండు గదులను ప్రయోగశాలలకు, రెండు గదులను తరగతులకు కేటాయించారు. ప్రస్తుతం రేకులషెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు రేకులు, తలుపులు, కిటికీలు ధ్వంసమవగా గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. వర్షాలకు గదులు ఉరుస్తున్నాయి. రేకులకు రంధ్రాలు పడటంతో వానరాలు లోనికి ప్రవేశిస్తున్నాయి. గతంలో నిర్మించిన మూత్రశాలలకు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. మరోచోట ఉన్న మూత్రశాలలకు కూడా నీటి సరఫరా లేక బాలికలు ఇబ్బంది పడుతున్నారు. బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాలు బేస్‌మెంటుస్థాయికే పరిమితమయ్యాయి.

ఈ పనులు చేస్తే...

జూనియర్ కళాశాలలో తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు, గ్రంథాలయం, బాలికలు నిరీక్షణ తదితర అవసరాలకు మరో 14 గదులను నిర్మించాల్సి ఉంది. అన్ని వసతులతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా కళాశాలపై శీతకన్ను వేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైకప్పు రేకులతో కూడిన గదులకు కనీస మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వసతుల లేమి విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మూత్రశాలలకు నీటిని సరఫరా చేసి, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

14 గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న గదులకు తోడు మరో 14 గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మారుమూల ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుంది. సీహెచ్.మోహన్, డీఐఈవో

# వరద ముప్పుపై పట్టింపేదీ?

ఎల్లారెడ్డిపేట: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గతంలో వరద బీభత్సంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈసారి ముందస్తుగా వరద ముంపు నుంచి ప్రజలను కాపాడేలా చర్యలు తీసుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. మురుగు కాలువల్లో పూడికతీతతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. లేకుంటే భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల మునకతో ఇబ్బంది పడాల్సిందే. గత వరదల్లో కొట్టుకుపోయిన వంతెనలు, రహదారులు, శిథిలావస్థలో ఉన్న కాల్వలకు మరమ్మతు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తెగిన వంతెనతో తిప్పలు గతంలో భారీ వర్షాలకు జనగామలోని ప్రధాన వంతెన తెగిపోయింది. అవతలి వైపు పొలాలు కలిగిన రైతులతో పాటు గోదావరి పుణ్యస్నానాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. హిందూ శ్మశానవాటిక సైతం నది ఒడ్డునే ఉండడంతో అటుగా వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు. ఇటీవల తాత్కాలికంగా తెగిన వంతెన పక్క నుంచి మట్టి పోయడంతో రాకపోకలు మొదలయ్యాయి. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే పోసిన మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

ముందస్తు చర్యలు కరవు

నగరంలోని పలు మురుగు కాలువలు శిథిలమయ్యాయి. కాలువ గోడల రాళ్లు ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకే నీరు రోడ్డెక్కి పారుతోంది. కొన్ని చోట్ల ఇళ్లలోకి చేరుతోంది. మరోసారి వరద ముంపు తప్పించుకునేందుకు నగరపాలిక ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని చోట్ల కాలువ మరమ్మతుల కోసం తవ్వి వదిలేయడంతో మరింత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

అటకెక్కిన కాలువల నిర్వహణ

వర్షాకాలానికి ముందుగానే ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉండగా ఈ సారి అలాంటి చర్యలే లేవు. నగరంలోని గల్లీ మురుగు కాలువల నుంచి మొదలుకొని ప్రధాన కాలువల వరకు ఎక్కడికక్కడ పూడిక నిలిచిపోయింది. దీంతో ప్రవాహానికి పూడిక అడ్డు తగలడంతో వరదలు రోడ్డెక్కుతున్నాయి.

ప్రణాళికా లోపం.. ప్రజలకు శాపం

అధికారుల ప్రణాళికా లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. రహదారి నిర్మాణం చేపట్టి వరద పారుదల చర్యలు తీసుకోకపోవడంతో చినుకు పడితే వరద రోడ్డు చివరికి వచ్చి నిలుస్తోంది. అక్కడకక్కడ మురుగు కాల్వల్లోకి వెళ్లేలా ఏర్పాటు చేసినా రంధ్రాలు రోడ్డుకంటే ఎత్తుగా ఉండడం, కొన్ని చోట్ల పూడుకుపోవడంతో నిరుపయోగంగా మారాయి. రాజీవ్ రహదారి నుంచి కేసీఆర్ కాలనీ, పద్మావతి కాలనీ తదితర అయిదారు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి చిరు వర్షానికే బురదమయమవుతోంది. భూగర్భ కాలువ కోసం రోడ్డును తవ్వడం, వరద వెళ్లేందుకు రోడ్డుపక్కన ఏర్పాట్లు లేకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి.

వంతెన నిర్మించారు.. రోడ్డు మరిచారు

అబాది రామగుండం సమీపంలోని పాములపేటలో మూడేళ్ల క్రితం వంతెన నిర్మించిన అధికారులు ఇరువైపులా అప్రోచ్, రోడ్డు నిర్మాణాన్ని విస్మరించారు. దీంతో వంతెన నిరుపయోగంగా మారింది. ఇరువైపులా కొంత మట్టి పోసినా భారీ వర్షాలు కురిస్తే కొట్టుకుపోవడంతో పాటు వాగు పొంగితే గ్రామీణులు వంతెనకు అవతలి వైపు వెళ్లలేని పరిస్థితులున్నాయి. పటిష్ఠంగా రహదారి నిర్మాణం చేపట్టి వంతెనను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# విద్యార్థులకు రాగిజావ

జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానిని చేర్చగా, ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా ఉదయం వచ్చే సమయంలో ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడంలేదు. ఫలితంగా రక్తహీనత, పోషకాహార లోపంతో కనిపించడంతోపాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవం నుంచే కొత్త కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని 753 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 65 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా కార్యాచరణ రూపొందించారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బెంగళూరు కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ



ట్రస్టు జగిత్యాల ఆధ్వర్యంలో దాదాపు 320 పాఠశాలల్లో చదివే 32 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. 2015లో జగిత్యాలలోని మోతె గ్రామ శివారులోని నాగేంద్రనగర్ కాలనీలో 50 మంది విద్యార్థులకు పాలు, హార్లిక్స్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రస్తుతం గత ఏప్రిల్ వేసవి సెలవుల వరకు దాదాపు 50 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా చూశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా పాఠశాల సెలవుల్లో మిగిలిపోయిన రాగి జావ పౌడర్‌ను జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, రజకులు దాదాపు 1670 కుటుంబాలకు కిలో చొప్పున అందించారు. ఇందులో జగిత్యాలలో 350 పారిశుద్ధ్య, 700 రజక, మెట్‌పల్లి, జమ్మికుంటలో 300 కుటుంబాల చొప్పున పారిశుద్ధ్య కుటుంబాలకు అందించారు.

పేద పిల్లలకు ప్రయోజనకరం

గోవర్ధన ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

ఉదయం పూట ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు రాగిజావ అందించడం మంచి నిర్ణయం. ఇప్పటికే పలు పాఠశాలల్లో అన్నపూర్ణ సత్యసాయి ట్రస్టు ద్వారా రాగిజావ అందిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని నిర్ణయించడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలోనూ వెజిటబుల్ బిర్యానిని చేర్చారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అంది చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపే అవకాశంతో పాటు విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది.

జిల్లాలో పంపిణీ చేస్తున్నాం

ఊటూరి శ్రీకాంత్, ట్రస్టు రీజినల్ సమన్వయ కర్త

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి పోషకాహార లోపంతో బాధపడకూడదని ఇప్పటికే పలు పాఠశాలల్లో రాగిజావ అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు గతేడాది చివరి వరకు అందించేలా చూశాం. వేసవి సెలవుల్లో మిగిలిన రాగిజావ పౌడర్‌ను జిల్లాలోని దాదాపు వెయ్యికి పైగా పారిశుద్ధ్య, రజక కుటుంబాలకు అందించాం. ప్రస్తుతం ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అందించేలా ట్రస్టు ఆలోచన చేస్తుంది.

# పైపైనే జలం.. సాగుకు బలం

జగిత్యాల : యాసంగి ముగిసి వానాకాలం పైర్లసాగు ముంగిట జిల్లాలోని మండలాల్లో లభ్యతగల భూగర్భ జలాలు అన్నదాతలకు ఆశాజనకంగా మారాయి. 2022 మే నెలాఖరున 5.81 మీటర్ల లోతుతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత పైనే 5.51 మీటర్ల సరాసరి లోతులో ఉండటం పైర్లసాగుకు ఉపకరించనుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీటిని వదలగా వరద కాలువలోకి కూడా పలు దఫాలుగా నీటిని విడుదల చేశారు. దీంతోపాటు కాకతీయ, వరదకాలువలు, ఇతర డిస్ట్రిబ్యూటరీల నుంచి కూడా చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయటంతో వేసవి ముగిసినా చాలా నీటి వనరులు జలంతోనే నిండి ఉన్నాయి. వాగులు, ఒర్రెల్లోనూ నీరు పారుతుండగా భూగర్భ జలమట్టం పైపైనే ఉండి నెలరోజులు ముందుగా పంటలను సాగుచేయాలన్న ప్రభుత్వ సూచనకు దోహదకారిగా మారింది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.726 టీఎంసీల నీరు నిలువుంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎల్లంపల్లి నుంచి జలాలను ఎత్తిపోసి వరద కాలువలో నిండుగా నిల్వచేసే వీలుండటం, సగటు భూగర్భ జలమట్టం 5.51 మీటర్లుగా ఉండటం వానాకాలం పైర్లసాగుకు కలిసిరానుంది. కాలువలతో పాటుగా బావులు, బోర్లలోనూ సమృద్ధిగా నీరుండగా మోటార్ల ద్వారా నీటిని తోడుకునే వీలుండటంతో వరినార్లకు అవకాశం కలిగింది. ప్రస్తుతం కనిష్ఠ స్థాయిలో భూగర్భ జలాలుండటంతో 1.27 లక్షల పంపుసెట్ల ఆధారితంగా జిల్లాలో పైర్లసాగుకు అవకాశం ఏర్పడిందని భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి జి.నర్సింహులు పేర్కొన్నారు. ఈ వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా ఇందులో అత్యధికంగా 2.98 లక్షల ఎకరాల్లో వరిని పండించనున్నారు. ఇప్పట్నుంచి జులై నెలాఖరు వరకు పెద్దఎత్తున వరినార్లు పోసి సెప్టెంబరు వరకు వరినాట్లు వేస్తారు కాబట్టి వీరికి జల లభ్యత ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలతో ప్రాజెక్టుల నీటి లభ్యత, భూగర్భ జలాల అందుబాటుతో రైతులు వానాకాలం పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతుండగా ప్రకృతి కరుణించి సమృద్ధి వర్షాలు కురిసి, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలు సిద్ధిస్తే ఈ సీజన్‌లోనూ రైతులు మెండైన పంటలను సాగుచేయగలుగుతారు.

# కళ కోల్పోతున్న రింగ్ రోడ్డు కూడళ్లు



ఖమ్మం : మూడు వైపులా త్రిభుజాకార ఐలాండ్‌లు, పచ్చని మొక్కలు, ఫౌంటెయిన్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రధాన కూడలిగా ఉన్న తల్లాడ రింగురోడ్డు అది. ఇక్కడి నుంచి భద్రాచలం, ఖమ్మం, సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం, వైజాగ్ ఇలా మూడు వైపులకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఆ కూడలి నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ఆ నిర్మాణాలు గత ప్రాభవానికి గురుతులుగానే మిగులుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సైతం రెండేళ్ల క్రితం ప్రకటించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసం

రింగురోడ్డు నుంచి మూడువైపులా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైజాగ్‌కు పెద్దపెద్ద యంత్రాలను తరలించే లారీలు, కాకినాడకు భారీ గ్రానెట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు మలుపుతిరిగే సమయంలో రింగురోడ్డు గోడలు, ఇనుప గ్రిల్స్, దిమ్మెను తాకుతూ వెళ్లడంతో అవి విరిగిపోతున్నాయి. త్రిభుకార ఐలాండ్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీలు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఆ జాలీల్లో నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్తు దీపాలు సరిగా వెలగక అంధకారంగా మారింది. తల్లాడ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసినా వాటి వెలుగులు సరిపోవడం లేదు.

దారిలో కలిసిన డివైడర్


తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు డివైడర్ ఉంది. ప్రతి సంవత్సరం రహదారులు నిర్మిస్తుండటంతో రోడ్డు ఎత్తు పెరిగి డివైడర్‌కు సమానమైంది. వాహనదారులు డివైడర్‌పై నుంచీ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తల్లాడ రింగురోడ్డుకు పూర్వవైభవం తీసుకురావాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారి విస్తరించి.. డివైడర్లు విస్మరించి

మధిర-విజయవాడ రోడ్డులో ఎర్రుపాలెంలోని ప్రధానమైన రింగ్ కూడలిలో రహదారి విస్తరించిన అధికారులు ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవటంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. విజయవాడకు ప్రధాన రహదారి కావటంతో వాహనాల రద్దీ పెరుగుతోంది. మధిర, విజయవాడ వైపు ఉన్న రహదారుల్లో డివైడర్లు ఏర్పాటు చేయకపోవటంతో వేగంతో వచ్చి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రింగ్‌లో ఫౌంటెయిన్ నిర్మించకుండా వదిలేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నిధులు కేటాయించి, డివైడర్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు పడగానే తల్లాడ రింగురోడ్డు కూడలిలో మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దుతాం. అవకాశం ఉంటే తల్లాడ రింగురోడ్డు కూడలిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో రింగురోడ్డు కూడలి ఉన్నది. ఈ రింగురోడ్డును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులదే. ఆ అధికారులు రింగురోడ్డు కూడలి గురించి పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీకి సంబంధం లేదు. బి.రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ, తల్లాడ

# ప్రభుత్వ, పరిశ్రమ భూముల్లో ఆక్రమణలు



గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విలువైన భూములు ఆక్రమార్కుల చేతుల్లో వెళ్తున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన స్థలాలకు హద్దుల ఏర్పాటు లేకపోవడంతో పాటు పట్టామార్పిడి చేసుకోకపోవడాన్ని కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విలువైన భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. రామగుండం ప్రాంతంలో పేదల అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు దళారులు దర్జాగా కబ్జా చేస్తూ విక్రయించుకుంటున్నారు. రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని దక్కించుకోవడానికి రహదారి వెడల్పును తగ్గించి మరీ మిగతా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పేదప్రజల ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన 100 ఎకరాల భూమిలో సైతం పాగా వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు హద్దులు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వారి దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని కూడా దక్కించుకోవడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు.

పేదల ఇళ్లకోసం సేకరిస్తే...


ప్రభుత్వం పేద ప్రజల ఇళ్ల కోసం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని సేకరించింది. ఒక ఎకరాకు రూ.5 లక్షల చొప్పున చెల్లించిన ప్రభుత్వం వంద ఎకరాలు సేకరించి న్యూ పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అందులో 15 ఎకరాలు ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు దానిపై కన్నేశారు. అందులో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడిపల్లి శివారులోని 17 సర్వే నెంబర్ల నుంచి వంద ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఒక సర్వే నెంబరులో ఉన్న తప్పును కొంతమంది అనుకూలంగా మలుచుకుని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ప్లాట్లను విక్రయించిన దళారులు తమ దందాను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూల్చివేసినా కొద్ది రోజులు దందాను నిలిపివేసి మళ్లీ మొదలు పెడుతున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

రహదారి పక్కన...సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు వదలడం లేదు. వంద ఫీట్ల రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సేకరించిన భూమికి పరిహారం చెల్లించింది. పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మేడిపల్లి నుంచి రామగుండం వెళ్లేందుకు ఏర్పాటు చేసే లింకు రోడ్డును 30 ఫీట్లకు కుదించి మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఎంతో విలువైన భూమిని అక్రమార్కులు తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సింగరేణి విస్తరణ కోసం గతంలో సేకరించిన భూముల్లో సైతం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఓసీపీ-5 కోసం సేకరిస్తున్న భూమిలో కూడా గతంలో సంస్థ పరిహారం చెల్లించిన భూములకే మళ్లీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. జనగామ, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల పరిసర ప్రాంతాల్లో భూమి రికార్డులు లేకపోవడంతో మళ్లీ వాటికే పరిహారం చెల్లించే పరిస్థితి. భూసేకరణ సమయంలో పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో సంస్థ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆయా అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# పర్యవేక్షణ కొరవడి.. పనులు తడబడి

ఇల్లెందు : వృథాగా కిందకు ప్రవహించే వర్షపు నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు పరిసరాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే చెక్‌డ్యాంల లక్ష్యం. ఈ నేపథ్యంలో 2020-21 సంవత్సరంలో ఫేజ్-1లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 77 చెక్ డ్యాంల నిర్మాణానికి నాబార్డు రూ.207.69 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 14,670 ఆయకట్టుకు నీరందుతుందని అంచనా రూపొందించారు. డ్యాంల నిర్మాణాలు పూర్తయ్యాయి కానీ, అనుబంధంగా చేపట్టాల్సిన చివరి పనులు చేపట్టకపోవడంతో ఈ సీజన్‌లోనూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. గుత్తేదారుల అశ్రద్ధ, అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణంగా నిలుస్తోంది. చెక్‌డ్యాంల వద్ద డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్, రివిట్‌మెంట్‌లు, గైడ్‌వాల్స్, సైడ్‌బండ్స్ నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

రైతులకు కొత్త కష్టాలు..బెడ్ పిచింగ్‌లు నిర్మించకపోవడంతో వాగు దాటి పంట పొలాలకు వెళ్లేందుకు, సైడ్‌బండ్స్, గైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో వాగు పొంగిన సమయాల్లో సమీప పొలాలు కోతకు గురవుతున్నాయి. దీంతో ఏమి చేయాలో తోచక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా రివిట్లు కూడా నిర్మించకపోవడంతో వాగు ఉద్ధృతి ధాటికి ఒడ్డు కోతకు గురవుతూ సమీప పొలాల్లోకి వరద



పోటెత్తుతోంది. ఉదాహరణకు టేకులపల్లి మండలం ముక్కుమడుగుపై 2020-21లో చేపట్టిన చెక్‌డ్యాం పనులు కొద్ది రోజుల క్రితం పూర్తయ్యాయి. డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్ చేయకపోవడంతో వాగు ఒడ్డుకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. నీళ్లు నిలిచి అరకలు, ఎరువులు ఒడ్డు అవతలి వైపు తీసుకెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చివరి బిల్లులు నిలిపేశాంచెక్‌డ్యాం స్ట్రక్చర్‌ల నిర్మాణాలు వందశాతం పూర్తయ్యాయి. పది చెక్‌డ్యాంలకు సంబంధించిన తుదిదశ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరి బిల్లులు నిలిపివేయడంతో పాటు గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. వాగుల్లో నీటి ప్రవాహం కారణంగా అసంపూర్తి పనులు చేపట్టే అవకాశం లేదు. వీలైన సమయాల్లో పూర్తిచేయిస్తాం. శంకర్‌నాయక్, సీఈ,జలవనరుల శాఖ

# తాగునీటి గండం

ఖమ్మం : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి గండం తరుముకొస్తోంది. మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు ముప్పు పొంచి ఉంది. పాలేరు జలాశయంలో జల లభ్యత ఆధారంగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ పథకాలు నిర్మించారు. ప్రస్తుతం పాలేరు జలాశయంలో నీటిమట్టం అడుగంటుతోంది. ఈ రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి మిషన్ భగీరథ పథకాలకు నీరందేలా చూడాలని ఎస్ఈ సదాశివకుమార్ ఖమ్మంలోని జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్‌కు లేఖ అందించారు. జిల్లాలో తాగునీటి అవసరాలు తీరేలా సాగర్ జలాలు విడుదల చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీఈ తెలిపారు.

పాలేరు నుంచి మూడు జిల్లాలకు..

పాలేరు రిజర్వాయర్ నుంచి కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, రఘునాథపాలెం మండలాల్లోని 359 ఆవాస ప్రాంతాలు, ఖమ్మం కార్పొరేషన్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందిస్తున్నారు. పాలేరు జలాశయం ఇన్‌టెక్ వెల్ నుంచి నీటిని తీసుకుని జీళ్లచెర్వు వద్ద శుద్ధిపరిచి ప్రధాన పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నీటిని అందించేందుకు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్ద నీటిశుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. అక్కడి



నుంచి 1,686 ఆవాస ప్రాంతాలు, ఐదు మున్సిపాలిటీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ రిజర్వాయర్ నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు 389 ఆవాస ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇన్‌టెక్ వెల్‌లో పూడిక పేరుకుపోవడంతో మోటార్లకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పాలేరు, నర్సింహులగూడెం, కిష్టాపురం, జుజ్జులరావుపేట, నాయకన్‌గూడెం, ఈశ్వరమాదారం, రాజుపేట ప్రాంతాల్లోని 33 గ్రామాలకు మరో మోటారు ద్వారా తక్కువ పరిమాణంలో నీటిని సరఫరా చేస్తున్నారు.

రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం

పాలేరు రిజర్వాయర్ నుంచి మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం. 11 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్స్) జలాలు కావాలి. పాలేరులో ప్రస్తుతం ఉన్ననీరు 15 రోజులకు సరిపోతుంది. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. శుక్రవారం నాటికి 11.8 అడుగుల వరకు నీరుంది. 11 అడుగుల కిందికి దిగితే మిషన్ భగీరథ పథకాలకు నీరందదు. మిషన్ భగీరథ అధికారులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 519.4 అడుగుల నీరుంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తే పాలేరు జలాశయానికి చేరేందుకు కనీసం మూడు రోజులు పడుతుంది. సాగర్ ఎడమ ప్రధాన కాల్వపై ఎగువ ప్రాంతంలో అత్యవసర మరమ్మతులు జరుగుతున్నాయి. నీటిని విడుదల చేయాలంటే మరమ్మతులు నిలిపేయాల్సిందే.

తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులకు లేఖ రాశాం. సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలంటే ఎగువ ప్రాంతంలో కొన్నాళ్ల పాటు మరమ్మతులు నిలిపేయాలి. మరో 15 రోజులకు సరిపడా తాగునీరు మాత్రమే పాలేరు జలాశయంలో ఉంది. సాగర్ జలాల సరఫరాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. శంకర్ నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

# గింజలు మొలవక.. ఆశలు చావక!

ఖమ్మం: అన్నదాతలకు వానాకాలం పరీక్ష పెడుతోంది. తొలకరి పలకరింపుతో కొండంత ఆశతో సాగు పనులు మొదలుపెట్టినా క్రమేణా వర్షాలు ముఖం చాటేస్తుండటంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు మొలకెత్తని కొన్నిచోట్ల రెండోసారి, మూడోసారి మళ్లీ గింజలు వేస్తున్నారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు రైతులకు విత్తన భారం తప్పటం లేదు.

భద్రాద్రి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొత్తంమ్మీద 91,071 (ప్రధానంగా పత్తి- 45,972, వరి- 5,057, మొక్కజొన్న- 4,945) ఎకరాలు, ఖమ్మం జిల్లాలో మొత్తంమ్మీద 1,43,890 (ప్రధానంగా వరి- 50,704, పత్తి- 87,985, పెసర-4443, మొక్కజొన్న- 326) ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి.

పత్తి రైతులకు విపత్తు..


మే ఆఖరు నుంచే రైతులు పత్తి సాగుకు పూనుకున్నారు. జూన్‌లో తొలకరి పలకరింపుతో ఎక్కువ మంది విత్తనాలు వేశారు. ఆ తర్వాత ఆశించిన మేరకు వానలు కురకవపోవటంతో 30-40 శాతం గింజలు మాత్రమే మొలిచాయి. ఉభయ జిల్లాల్లో ఇప్పటివరకు 1,33,957 ఎకరాల్లో పత్తి సాగైతే సుమారు 85వేల ఎకరాల్లో గింజలు మొలకెత్తలేదు. రైతులు మరోసారి విత్తనాలు నాటుతున్నారు. ఎకరాకు గింజలు వేసేందుకు సుమారు రూ.10 వేలు వెచ్చించాలి. దుక్కి దున్నేందుకు రూ.4వేలు ఖర్చు చేయాలి. రెండోసారి విత్తనాలు నాటితే ఎకరాకు అదనంగా రూ.10వేల పెట్టుబడి అవసరమవుతుంది. ఒకట్రెండు సార్లు గింజలు నాటడం వల్ల మొక్కల చుట్టూ పిచ్చిగడ్డి మొలుస్తుంది. దీన్ని తొలగించేందుకూ అదనపు ఖర్చు తప్పదు.

ఐదెకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేస్తున్నా. తొలుత కురిసిన వానలకు గింజలు నాటాను. ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.50వేలు ఖర్చయ్యింది. వానలు లేక విత్తనాలు మొలకెత్తలేదు. రెండోసారి గింజలు పెడుతున్నా. పెట్టుబడి రెట్టింపవుతోంది. ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నా వర్షాలు కురవటం లేదు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టాను. ఏం చేయాలో పాలుపోవటం లేదు. గోపయ్య, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

ఐదెకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. సీజన్ మొదట్లో కురిసిన వానకు విత్తనాలు పెట్టాం. దుక్కిదున్నడం, విత్తనాలు, కూలీల ఖర్చు కలిపి ఎకరాకు రూ.15 వేల చొప్పున రూ.75వేల వరకు పెట్టుబడి పెట్టాను. వానలు లేక గింజలు మొలకెత్తలేదు. మళ్లీ దుక్కి దున్ని రెండోసారి విత్తనాలు వేస్తున్నాను. ఈసారి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అదనపు భారం తప్పటం లేదు. చందూలాల్, పరికలబోడుతండా, రఘునాథపాలెం మండలం

# నిర్వహణ నిధులేవి?

మేడ్చల్ : ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల నిర్వహణ నిధులు పాఠశాల యాజమాన్య కమిటీ అకౌంట్‌లో సర్వశిక్షా అభియాన్ ద్వారా జమ చేసేవారు. ఈ ఏడాది ఇంకా డబ్బు జమ కాలేదు. తాగు నీరు, పాఠశాల పరిశుభ్రత, ఇతర వసతుల నిర్వహణకు డబ్బులకు హెచ్ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం కోసం, పాఠశాలకు అవసరమయ్యే నీటి నిర్వహణలో మోటారు రిపేరు, పైపుల అమరిక తదితర అవసరాల కోసం ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. చాక్‌పీసులు, డస్టర్లు, బోర్డులు, స్టేషనరీ తదితర సామగ్రిని సొంత డబ్బుతో తెప్పిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ, మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత పనులు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. కొన్నిచోట్ల పంచాయతీలు, మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నా దాదాపు ఎక్కువ శాతం స్కూళ్లలో పరిశుభ్రత కోసం పంచాయతీ, మున్సిపల్ అధికారులు శానిటరీ సిబ్బందిని పాఠశాలలకు కేటాయించడం లేదు. తమకే సరిపడా సిబ్బంది లేరని చెబుతున్నారు. పాఠశాల గ్రాంట్ విడుదల కాక అటు పరిశుభ్రత పనుల చేపట్టేందుకు సిబ్బంది సహకరించక స్కూళ్లలో ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. మరుగుదొడ్ల కడిగేందుకు ఫినాయిల్ లేదు. స్కూల్లో ఒక మోటార్ రిపేర్ చేయాలన్నా, మైనర్ రిపేర్ చేయాలన్నా, రిజిస్టర్లు, స్టేషనరీ కొనాలన్నా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఎంసీ అకౌంట్లు మూసివేతపాఠశాలల నిర్వహణ నిధులను ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ అకౌంట్లలో జమ చేసేది. హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్ ఇద్దరి సంతకంతో కూడిన చెక్కు ద్వారా డబ్బులు విత్‌డ్రా చేసుకునేవారు. 2022 ఏప్రిల్‌లో ప్రభుత్వం ఎస్ఎంసీ అకౌంట్లలోని మిగిలిన డబ్బును వెనక్కి తీసుకుని అకౌంట్లను క్లోజ్ చేయించింది. విద్యాశాఖ పాఠశాల నిర్వహణ నిధులపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. కొత్త అకౌంట్లనూ తెరువలేదు. నోడల్ ఏజెన్సీ ద్వారా పాఠశాల




నిర్వహణకు నిధులు కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. జిల్లాలో 509 పాఠశాలలుమేడ్చల్ జిల్లాలో మొత్తం 509 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదల కావాల్సి ఉంది. 110 ఉన్నత, 26 ప్రాథమికోన్నత, 373 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఒక విద్యాసంవత్సరానికి ఉన్నత పాఠశాలలకు రూ.60వేలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.25వేల వరకు నిర్వహణ నిధులు కేటాయిస్తారు. వజ్రోత్సవాల ఖర్చుల భారం...: – విజయకుమారి, ఈఓ, మేడ్చల్ భారత స్వతంత్ర వజ్రోత్సవాలలో భాగంగా పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆటల పోటీలు, వ్యాసరచనలు, ర్యాలీలు, ముగ్గుల పోటీలు నిర్వహించాలని సూచించింది. కేటాయించిన నిధులను విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులపై అదనపు ఖర్చుల భారం పడింది. కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదు. పాఠశాల నిర్వహణ నిధుల్లో కేంద్రం వాటా ఇంకా ఇవ్వలేదు. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. తప్పకుండా విద్యాశాఖ నుంచి పాఠశాల నిర్వహణ కోసం నిధులు వస్తాయి. కాస్త టైం పడుతుంది.వెంటనే నిధులు విడుదల చేయాలి: – ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడుపేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం వివక్ష చూపకూడదు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని రకాలుగా నిధులు సమకూర్చాలి. స్టేషనరీ కొనాలన్నా పాఠశాల గ్రాంట్‌లో డబ్బులు లేవు. వెంటనే పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలి.

# తాండూరు బల్దియాలో భర్తీలు ఎప్పుడో?

మేడ్చల్ : తాండూరు మున్సిపాలిటీలో ఆఫీసర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం, ఇక్కడ పోస్టింగ్ ఉన్న అధికారులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో పనిచేయడం, ఏడాదిన్నరగా ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగడంతో పాటు ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో రోజు వారీ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఉన్న సిబ్బంది సర్దుబాటుతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తోంది. ఓ వైపు అధికార టీఆర్ఎస్ పార్టీలో చైర్‌పర్సన్ పదవి కోసం కిస్సా కుర్సీగా కీచులాటలు నడుస్తుండగా, మరోవైపు సిబ్బంది కొరతతో అభివృద్ధి కుంటుబడింది. తాండూరు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా ఆర్డీవో అశోక్‌కుమార్ ఏడాదిన్నరగా కొనసాగుతున్నారు. రెవెన్యూ కార్యక్రమాలతో బిజీగా ఉండే ఆర్డీవో మున్సిపాలిటీ బాధ్యతను కూడా నిర్వహిస్తూ బల్దియాను నెట్టుకొస్తున్నారు. ఇదిలా ఉంటే మున్సిపాలిటీలో కీలకమైన పోస్టు రెగ్యులర్ అధికారిగా మేనేజర్ నరేందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. అయితే మిగిలిన ముఖ్యమైన పోస్టులకు సంబంధించి ఇన్‌చార్జి బాధ్యతలను కూడా మేనేజర్‌కే కట్టబెట్టారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, అకౌంటెంట్ రెవెన్యూ అధికారి ఇన్‌చార్జి పోస్టులను కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెగ్యూలర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న విక్రంసింహారెడ్డి డిప్యూటేషన్‌పై వివిధ మున్సిపాలిటీలకు పంపించి ప్రస్తుతం వనపర్తి ఇన్‌చార్జీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. రెండేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. తర్వాత శ్యాంసుందర్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా తాత్కాలికంగా ఇక్కడికి పంపినప్పటికీ ఇక్కడి రాజకీయాల వల్ల శ్యాంసుందర్‌రావు ఇక్కడి నుంచి బెల్లంపల్లికి బదిలీపై వెళ్లారు. తాండూరు రెవెన్యూ అధికారిగా ఉన్న ప్రకాష్ డిప్యూటేషన్‌పై శంషాబాద్‌కు వెళ్లారు. ఆరు నెలలుగా ఈ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లలో ఒక సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఇక్కడి నుంచి ఆందోల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఇర్షాద్ మూడేళ్ల క్రితమే మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. తాండూరు మున్సిపాలిటీని టీపీఎస్ నెట్టుకొస్తున్నారు. కొన్నేళ్లుగా తాండూరు మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. తాండూరు మున్సిపల్ అకౌంటెంట్ రెగ్యూలర్ పోస్టు ఉండగా, పోస్ కింద ఆరు నెలల క్రితమే ఇక్కడి నుంచి అకౌంటెంట్ జనగామాకు బదిలీపై వెళ్లారు.



# పెరటి తోటలపై పెదవి విరుపు

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పెరటి తోటల (న్యూట్రీ గార్డెన్స్) పెంపకం కాగితాలకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం అంగన్‌వాడీ టీచర్ల అసలత్వం, అనాసక్తి వల్ల అమలులో నీరుగారిపోతోంది. ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పెరటి తోటలను పెంచాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు కూడా పెరటితోటల పెంపకం విషయంలో పెద్దగా పట్టించుకోవడం లేదు. ఖాళీ స్థలాల కొరత వల్ల పెరటితోటలను పెంచలేకపోతున్నామని టీచర్లు చెబుతున్నా.. ఉన్నచోట వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదు. వీటి విషయంలో అధికారులు అంగన్‌వాడీ టీచర్లకు తగిన శిక్షణ, అవగాహన కల్పించడం లేదు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 2018లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహా రం కోసం కేంద్రాల పరిధిలోని కార్యకర్తలు ఖాళీస్థలాల్లో పెరటి తోటలను (న్యూట్రీగార్డెన్లు) ఏర్పాటు చేయాలి. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించి వాటిని వండి ఆహారంగా అందించాలి.

మార్గదర్శకాలు

గ్రామీణ మహిళల్లో ఆరోగ్యం విషయంలో అవగాహన అంతగా ఉండదు. ఇందుకు కారణం నిరక్షరాస్యత. దీంతో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారు. పోషకలోపంతో చిన్నారుల్లో ఎదుగుదల మందగిస్తోంది. దీనిని అ ధిగమించడానికి పెరటి తోటల పెంపకానికి కేంద్ర ప్రభు త్వం మార్గదర్శకాలను జారీ చేసింది. తోటల్లో నిత్యం వంటావార్పుల్లో కీలక పాత్ర పోషించే కూరగాయలు, ఆకుకూరల మొక్కలను పెంచాలని సూచించింది. సాధారణ స్వభావం ఉన్న నేలల్లో ఎలాంటి సస్యరక్షణ చర్య లు తీసుకోకున్నా సులువుగా పెరిగే వీలున్న కరవివేపాకు, మెంతికూర, చెక్కకూర, పాలకూర, తోటకూర, కొత్తమీర, బొప్పాయిలాంటి మొక్కలు పెంచాల్సి ఉంటుంది. బెండ, దొండలాంటి అన్ని కాలాలలోనూ కాతనిచ్చే కూరగాయల మొక్కలను పెంచాలి. గ్రామంలోని ప్రజల సహకారం తీసుకొని పందిళు వేసి వీటిని సంరక్షించాలి. మొదట సేంద్రియ పద్ధతిలో సాగుకు అవసరమైన కంపోస్టు ఎరువు లేదా నాణ్యతగల మట్టిని సేకరించి పాదులు తవ్వాలి. వీలైనంత సాగుతో తోటలు కళకళాలాడేలా చూడాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థలాలు ఉంటే చక్కటి చిన్నచిన్న మడులు తయారు చేసి వాటిలో విత్తనాలు పోసి అవి పెరుగుతున్నప్పుడు తగిన రక్షణ కల్పించాలి. స్థలం లేకపోతే ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న తొట్టెలు, ప్లాస్టిక్ టబ్బులు, బకెట్లు, తీసుకువచ్చి వాటిలో మట్టిని నింపి కేంద్రం ఆవరణలో వీటిని పెంచి పోషించాలి.

అక్కడక్కడ..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 మండలాల్లో 3వేలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 780 కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి స్థలాలు ఉన్నట్టు గుర్తించినప్పటికీ ప్రస్తుతం 78 చోట్ల మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇక్కడ టీచర్లు సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండిస్తున్నారు. ప్రభుత్వమే కార్యకర్తలకు టమాట, వంకాయ, సొర, బీర, మెంతి, కొత్తమీర, పాలకుర, వంటి విత్తనాలను అందించింది.

కేంద్రాల నిర్లక్ష్యం

పెరటితోటలో కూరగాయలు పండించడమే కాకుండా తమ పరిధిలోని మహిళలు, ప్రజలకు సేంద్రియ పంటలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ కార్యకర్తలు పెరటితోటల పెంపకంపై శ్రద్ధ కనబర్చడం లేదు. ఈ క్రమంలో కేంద్రాల్లో స్థల సమస్య, నీరు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేశారు. కొవిడ్ కారణంగా రెండేళ్ల పాటు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత కూడా ఖాళీ స్థలాలు ఉన్న వాటిల్లోనూ పెరటి తోటల ఏర్పాటుకు కార్యకర్తలు ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, ఎలుకలు, ఇతరత్రా సమస్యలతో తోటలను నిర్వహించలేకపోతున్నారు.

స్థలాలు కరువు

ప్రస్తుత వర్షాకాలంలో స్థలాలున్న చోట పెరటితోటలను ఏర్పాటు చేస్తే సేంద్రియ ఆకు కూరగాయలతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. అయితే చాలా అంగన్‌వాడీ కేంద్రాలు సరైన వసతులు లేకుండా ఉన్నాయి. ఖాళీ స్థలాలు లేవు. ప్రహరీల లేవు. మొక్కలను పెంచినా రక్షణ ఒక సమస్యగా మారింది. ప్రజ ల సహకారం అంతంత మాత్రంగానే ఉంటోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు, వనరులు పట్టించుకోకుండా పెరటితోటలను పెంచాలంటే ఎట్లా అని వారు ప్రశ్నిస్తున్నారు.

పట్టింపేది?

హరితహారంలో భాగంగా రోడ్డపక్కన, ఇతర ఖాళీస్థలాల్లో పెద్దఎత్తున మొక్కలు పెంచాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు కానీ, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పెరటితోటల పెంపకాన్ని మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తోటల పెంపకానికి అనువైన వాతావరణం నెలకొని ఉన్నది. వసతి సదుపాయం కలిగిన అన్ని కేంద్రాల్లోనూ పెంచేలా చూడాల్సి ఉన్నప్పటికీ ఈ దిశగా పెద్దగా దృష్టి సారించడం లేదు. గతంలో ఈ దిశగా కొంత ప్రయత్నం జరిగినప్పటికీ ప్రస్తుతం ఆ విషయాన్ని పూర్తిగా మరిచిపోయారు. ఉమ్మడి జిల్లాలో పెరటి తోటల పెంపకానికి పక్కా ప్రణాళిక ఏదీ లేకపోవడం వల్ల ఒక మంచి కార్యక్రమం నీరుగారిపోతోంది.

# అడవి బిడ్డలకు ఆరోగ్యరక్ష

వరంగల్ : ఏజెన్సీ వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికార యంత్రం కసరత్తు చేస్తోంది. గిరిజన మండలాలకు పెద్ద ఆస్పత్రిగా పేరుగాంచిన ఏటూరునాగారంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో మరిన్ని వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే రక్తనిధి కేంద్రం సేవలు ఏజెన్సీ వాసులకు వరంగా మారగా గర్భిణులు, బాలింతలకు రక్షణగా మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. సీఎం ప్రత్యేక చొరవతో కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం డయాలసిస్ సెంటర్, తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ (టీ–హబ్) సేవలు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి. నవజాత శిశువు మరణాలను అరికట్టడంతో పాటు తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రూ.7 కోట్లతో 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మూడేళ్ల కిందటే ప్రభుత్వం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు జరుగుతుండగా ప్రస్తుతం అవి చివరి దశకు చేరుకున్నాయి. ఈనెల 9న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆయన పర్యటన రద్దు అయ్యింది. దీంతో ఆస్పత్రి ప్రారంభం వాయిదా పడింది. త్వరలోనే ఆస్పత్రి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. వైద్యశాలకు సంబంధించిన వైద్యులు, సిబ్బంది నియామకాలు గత ఏడాది నవంబర్‌లో పూర్తయ్యాయి. ఈ వైద్య సేవలు అందుబాటులోకి వస్తే ఏజెన్సీలోని గర్భిణులకు వరంగా మారనుంది. నవజాత శిశువు ఆరోగ్యంతో పాటు తల్లి ఆరోగ్యానికి సంబంధించి 24 గంటల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

త్వరలోనే డయాలసిస్ సేవలు

గత నెల ముఖ్యమంత్రి కేసీఆర్ ఏటూరునాగారం ప్రాంతంలో పర్యటించారు. మండలంలోని రామన్నగూడెం వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించి వరద బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఏటూరునాగారానికి డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేశారు. ఈ క్రమంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన యంత్రాలను ఆస్పత్రికి చేరుకున్నాయి. వీటిని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని రెండు గదుల్లో ఏర్పాటు చేసి ప్రారంభించడానికి సిద్ధం చేశారు. త్వరలోని డయాలసిస్ సెంటర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ఎంతో మేలు జరగనుంది.

గర్భిణులకు వరంగా రక్తనిధి కేంద్రం

గిరిజన పల్లెల్లోని గర్భిణులకు రక్తనిధి కేంద్రం సేవలు వరంగా మారాయి. గతంలో ఆస్పత్రిలో ప్రసవాల సమయంలో రక్తహీనతతో అనేక అవస్థలు పడేవారు. రక్తం దొరికే పరిస్థితి ఉండేది కాదు. రక్తనిధి కేంద్రం ఏర్పాటుతో గర్భిణులకు ఆ సమస్య తీరింది. గర్భిణులకు రక్తం కావాల్సిన సమయంలో అనేక మంది యువకులు ముందుకు వచ్చి రక్తనిధి కేంద్రంలో రక్తాన్ని అందిస్తున్నారు. గర్భిణులకు బ్లడ్‌బ్యాంక్ అపద్బాంధవుగా మారింది.

శరవేగంగా డయాగ్నస్టిక్ సెంటర్ పనులు

గిరిపుత్రుల వైద్య పరీక్ష నిమిత్తం ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను సామాజిక వైద్యశాలకు మంజూరు చేసింది. ఇందుకు భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో పూర్తి కానుంది. దీంతో రోగులకు వివిధ పరీక్షల నిమి త్తం ల్యాబోరేటరీ అందుబాటులోకి రానుంది. 24 గంటల సేవలు అందనున్నాయి. 53 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు.

పెరిగిన ఓపీలు.. ప్రసవాలు

ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల్లోని గిరిజనులకు పెద్దదిక్కుగా మారిన సామాజిక వైద్యశాలకు రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతిరోజూ ఓపీలు 200 నుంచి 250 వరకు వస్తున్నట్టు వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రిలో వైద్య నిపుణులు ఉండడంతో పాటు ఎంబీబీఎస్ డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తిస్తుండటంతో ఏజెన్సీలోని గిరిజనులు క్యూ కడుతున్నారని అంటున్నారు. గతంలో ఏజెన్సీ ఆస్పత్రుల్లో వైద్యాధికారుల కొరత తీవ్రంగా ఉండేది. కలెక్టర్, డీసీహెచ్ఎస్ ప్రత్యేక చొరవతో సామాజిక ఆస్పత్రికి అదనంగా స్పెషలిస్టు వైద్యులను నియమించారు. గైనకాలజిస్టు, అనస్తీషియన్, ఈఎన్‌టీ, ఎంబీబీఎస్ వైద్యులను ఒక్కొక్కరు చొప్పున విధుల్లో చేరారు. అయితే.. కొంత మంది వైద్యులు, సిబ్బందిని డిప్యూటేషన్‌పై ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి వైద్యులు, సిబ్బంది కొరత మళ్లీ ఏర్పడింది. గిరిజనులకు మెరుగైన వైద్యానికి కృషి – సురేష్ కుమార్, ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌ఏజెన్సీలోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వైద్యశాలలో ఔట్ పేషెంట్ల సంఖ్య ఈ రెండేళ్ల కాలంలో సుమారు 200లకు పెరిగింది. ప్రసవాల సమయంలో మాతా శిశు మరణాల రేట్ సున్నగా ఉంది. మా వైద్యశాలపై తొమ్మిది పీహెచ్‌సీలు ఆధారపడి ఉన్నాయి. అందుకు అనుగుణంగా మెరుగైన సేవలు అందించేందుకు నా తోటి వైద్యులు, సిబ్బంది విశేషంగా కృషి చేస్తున్నారు.

# అక్రమ లేఅవుట్లపై చర్యలు కరువు!

కామారెడ్డి : అక్రమ వెంచర్లు, ప్లాట్ల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకుండా పోవడమే కాకుండా లే అవుట్‌లేని ప్లాట్లను కొనుగోలు చేసిన సామాన్య, మధ్య తరగతి ప్రజలు మోసపోతున్నారు. దీంతో అక్రమ లే అవు ట్లు, ప్లాట్లు చేపడితే ఇకపై రిజిస్ట్రేషన్ చేయమని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. నాన్‌లేవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు పలు నిబంధనలతో కూడిన ఆదేశా లను ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే. అ క్రమ ప్లాట్లపై చర్యలు తీసుకునేందుకు వెళున్న అధి కారులపై స్థానిక రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు ఆ యా శాఖల అధికారులు వాపోతున్నారు. మరోవైపు లే అవుట్‌లకు అనుమతులు వస్తున్నాయంటూ రి యల్టర్‌లు కొనుగోలు దారులను మభ్యపెడుతూ నాన్ లే అవుట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయిస్తూ కోట్లలో దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.అక్రమ వెంచర్లపై రాజకీయ జోక్యం..జిల్లాలోని రియల్ వెంచర్లలో రాజకీయ నాయ కుల జోక్యం ఉండడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల పరిధిలో అనుమతి లేకుండానే ప్లాట్లుగా మారుస్తున్నారని తెలుస్తోంది. వెంచర్లకు అనుమతి తీసుకోవాలంటూ సంబంధిత శాఖ అధికారులు సదరు వెంచర్ నిర్వాహకులకు నో టీసులు పంపితే ఆ వ్యాపారులు స్థానికంగా ఉండే నేతలను కలిసి మున్సిపల్ అధికారులపై ఒత్తిడి చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త జిల్లాల ఎర్పాటు తర్వాత పట్టణాలు, మేజర్ గ్రామపంచాయతీల చుట్టూ ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పట్టణాలకు సమీ పంలో ఉన్న వ్యవసాయ భూముల న్నీ ప్లాట్లుగా మా రడంతో మధ్య తరగతి కుటుం బీకులు చిట్టీలు కట్టి, అప్పులు చేసి కొనుగోలు చేసిన వేలాది మంది రిజిస్ట్రేషన్లు కాక నిరీక్షిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా మూడు మున్సిపాలిటీలలో, మేజర్ గ్రామ పంచాయతీలలో ఇదే పరిస్థితి. కామారెడ్డి, బాన్సువాడ,ఎల్లారెడ్డి మున్సిపాలిటిలో లెక్కకు మించి అనుమతిలేని వెంచర్లు వెలిశాయి. ఎల్ఆర్ఎస్ వి?ధానంలో ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను సాకుగ చూపి మున్సిపాలిటీల్లో లేఅవుట్లని సక్రమమే అని చెప్పి ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేయించి, అనుమతి వస్తుందంటూ రియల్టర్లు కొనుగోలుదారులను మభ్యపెడుతున్నారు. కఠినంగా వ్యవహరించాల్సిందే..గతంలో జనవాసానికి ఆమోదం లేని ప్రాంతాలను రెడ్‌జోన్లు, బఫర్‌జోన్లుగా గుర్తించారు. అప్పట్లో ఇక్కడ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం అదేప్రాంతాల్లో వెంచర్లు ఏర్పాటుచేసిన చర్యలు తీసుకునేందుకు అ?ధికారులు వెనక్కి తగ్గుతున్నారు. రెడ్,బఫర్‌జోన్లు, శిఖం భూములు, ప్రభుత్వ, వక్ఫ్‌భూములు నాలాలపై వెంచర్ల ఏర్పాటు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఆదేశించాలని మూడు మున్సిపాలిటీల్లోనూ అక్రమ వెంచర్లు గుర్తించి రియల్టర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.జిల్లాలో 15 వేలకు పైగానే అక్రమ ప్లాట్లుజిల్లాలోని గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో అక్రమప్లాట్లు సుమారు 15 వేలకు పైగానే ఉన్నట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాల కింద అక్రమలే అవుట్లకు రిజిస్ట్రేషన్ చేయమని ప్రకటించి పలు నిబంధనలను జారీ చేసింది. అదేవిధంగా అక్రమలే అవుట్లను, ప్లాట్లను గుర్తించాలంటూ మున్సిపల్, పంచాయతీ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కామారెడ్డి జిల్లాలోని 526 గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.10వేలకు పైగానే అక్రమ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కామారెడ్డి మున్సిపాలిటీలో లేఅవుట్ లేని వెంచర్‌లలో 4 వేలకు పైగా అక్రమప్లాట్లతో పాటు మున్సిపల్ అధికారుల సర్వేలో తెలింది. బాన్సువాడ మున్సిపాలిటీలో 600, ఎల్లారెడ్డి మున్సిపాలిటిలో 400కి పైగా అక్రమ ప్లాట్లు ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు గుర్తించారు.

# అధ్వానంగా అంగన్‌వాడీలు

నిజామాబాద్ : జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయి. అద్దె గృహాలు, సౌకర్యవంతంగాలేని గదులు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. చిన్న పిల్లల ఆలనా పాలనా చూసే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురువుతున్నాయి. ప్రభుత్వం పాఠశాలలకు దీటుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నారుల యోగక్షేమాలు చూస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు రోజురోజుకూ నిర్వీర్యమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇరుకు గదుల్లో, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పోల్చితే పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఎక్కువ శాతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దెభవనాల్లో సరైన వసతులు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాల్లో 606 కేంద్రాలుజిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 447 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 606 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి వరకు అంగన్‌వాడీల అద్దె చెల్లించిన ప్రభుత్వం గత ఐదునెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు అంగన్‌వాడీ టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల ఇంటి యజమానులు అద్దె కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మొత్తం 42 అంగన్‌వాడీ టీచర్లు, 3మినీ టీచర్లు, 266 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్లు లేని చోట్ల ఆయాలు, ఆయాలు లేని చోట్ల అంగన్‌వాడీ టీచర్లు అన్ని పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.శిథిలావస్థలో 131 కేంద్రాలుజిల్లాలో 131 అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సర్కారు నిర్లక్ష్యంతో నిర్వీర్యం అయ్యే పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో 1500 అంగన్‌వాడీలు ఉండగా దాదాపుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీలు పాఠశాలల్లో, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడ సరైన వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 150 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయటే మూత్ర, మల విసర్జన చేయాల్సిన పరిస్థితి. 282 అంగన్‌వాడీలకు విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 131 అంగన్‌వాడీలు లీకేజీలతో ఇబ్బందులు పడుతుండగా 212 అంగన్‌వాడీల్లో చిన్న చిన్న మరమతులు చేయాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 50 అంగన్‌వాడీ కేంద్రా లు తాగునీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. 311పోస్టుల ఖాళీజిల్లాలో 1365 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా పనిచేయాల్సి ఉండగా.. జిల్లాలో 42 మెయిన్ అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 3మినీ అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 266 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిన్నారులకు సమయానికి భోజనం, పోషకాలు, గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పోషకాల అందించాల్సిన వీరు సిబ్బంది లేకపోవడంతో చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 86938 మంది చిన్నారులు, 11810మంది గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. కొన్ని అంగన్‌వాడీల్లో టీచర్లు, మరికొన్ని అంగన్‌వాడీల్లో ఆయా లేక చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలను కుంటున్నా ప్రభుత్వ నిర్ణయం నీరుగారుతోంది. అద్దె భవనాల్లో ఇబ్బందులు..నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు, ఆర్మూర్ ప్రాజెక్టల పరిధిలో చాలావరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆర్మూర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 326 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 41 అంగన్‌వాడీలు సొంత భవనాల్లో, 171 అద్దెభవనాల్లో, 114 రెంట్‌ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి.

# ఏపీ ఎన్నికల కమిషనర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం పిలుపు




అమరావతి: ఏపీ ఎన్నికల కమిషనర్ ఎం.కె.మీనాను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దిల్లీకి పిలిచింది. సీఈసీ పిలుపుతో ఆయన దిల్లీ చేరుకున్నారు. రాష్ట్రంలో భారీగా ఓట్లు గల్లంతయ్యాయని విపక్షాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలోనే ఆయన్ను దిల్లీకి పిలిచినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలు, స్థానిక యంత్రాంగం ఇష్టారీతిన ఓట్ల చేర్చడం, తొలగించడంపై కేంద్ర ఎన్నికల సంఘానికి పలు పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు, పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఈసీ కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముఖేష్ కుమార్ మీనాను దిల్లీకి పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# సక్సెస్‌కి షార్ట్ కట్ లేదు యువత కష్టపడాల్సిందే: లోకేశ్



నెల్లూరు : తెదేపా రాగానే.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెంచిన పన్నులన్నీ తగ్గిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. నెల్లూరు జిల్లా కొత్తపల్లి గ్రామస్థులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న 'జగనోరా' వైరస్‌కు చంద్రబాబే వ్యాక్సిన్ అని చెప్పారు. జగన్ పాలనలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు."కావలి ప్రజలు చూపించిన ప్రేమ ఎప్పటికీ మరవలేను. 150వ రోజు, 2 వేల కిలోమీటర్ల మైలురాయిని కూడా కావలిలోనే పూర్తి చేసుకున్నాను. అన్న క్యాంటీన్, చంద్రన్న బీమా, విదేశీ విద్య లాంటి అనేక సంక్షేమ పథకాలను తెదేపానే అమలు చేసింది. జగన్ పాలనలో ప్రజలు భయంతో జీవిస్తున్నారు. భయం పోవాలనే ఉద్దేశంతోనే యువగళం పాదయాత్ర మొదలు పెట్టాను. యువగళం మీ గళాన్ని వినిపించడానికి ఒక వేదిక. తెదేపా అధికారంలోకి రాగానే ఉద్యోగాలు లేని యువతకు ప్రతి నెలా ?3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తాం. ప్రతి ఏడాది నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పెండింగ్ పోస్టులు అన్నీ భర్తీ చేస్తాం. సక్సెస్‌కి షార్ట్ కట్ లేదు యువత కష్టపడితేనే జీవితంలో విజయం సాధిస్తారు." "జగన్ పాలనలో రైతులు అప్పులుపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జగన్ విద్యా వ్యవస్థను కూడా నాశనం చేస్తున్నాడు. స్కూల్స్ మూసేస్తున్నాడు. టీచర్ల పోస్టులు భర్తీ చెయ్యడం లేదు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత కేజీ నుండి పీజీ విద్యను ప్రక్షాళన చేస్తాం. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చేలా విద్యార్థులను సిద్ధం చేస్తాం" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# 2000 కి.మీ. చారిత్రాత్మక మైలురాయికి యువగళం!




నెల్లూరు: టీడీపీ యువనే నారా లోకేశ్ యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్ల చారిత్రాత్మక మైలురాయికి చేరుకుంది. 2000 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నెల్లూరు జిల్లా కొత్తపల్లిలో ఫిషరీస్ డెవలప్ మెంట్ బోర్డుకు లోకేశ్ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం యువనేత మాట్లాడుతూ.. ఈఏడాది మొదటి నెలలో కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాలచెంత తొలి అడుగుతో ప్రారంభమైన యువగళం జనగళమై, మహా ప్రభంజనమై, అరాచక పాలకుల గుండెల్లో సింహస్వప్నమై ప్రజలను చైతన్యపరుస్తూ లక్ష్యం దిశగా దూసుకుపోతోందన్నారు. ప్రజల కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ సాగుతున్న యువగళం పాదయాత్ర నేడు కావలి అసెంబ్లీ నియోజకవర్గం కొత్తపల్లి వద్ద చారిత్రాత్మక 2వేల కి.మీ. మజిలీకి చేరుకోవడం జీవితంలో మరపురాని ఘట్టంగా అభివర్ణించారు. ఇందుకు గుర్తుగా కొత్తపల్లిలో ఆక్వారైతులకు చేయూతనిచ్చే ఫిషరీస్ డెవలప్ మెంట్ బోర్డు ఏర్పాటుకు హామీ ఇస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించినట్లు లోకేశ్ వెల్లడించారు.

**రచ్చబండలో నారా లోకేష్...** నేడు జిల్లాలోని సిరిపురం క్యాంప్‌సైట్ నుంచి పాదయాత్రను ప్రారంభించిన లోకేశ్ కావలి నియోజకవర్గం కొత్తపల్లి గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు కొత్తపల్లిలో శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో యువనేత పాల్గొన్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా.. పాదయాత్ర మొదలు పెట్టిన రోజు మీ మనస్సులో ఉన్న ఆలోచన ఏంటి? యువతకు మీరు ఇచ్చే మెసేజ్ ఏంటి అంటూ లోకేశ్‌ను ఓ యువతి ప్రశ్నించింది. వరి రైతులు జగన్ పాలనలో అనేక ఇబ్బందులు పడుతున్నారని.. ధాన్యం కొనరు. కొంటే డబ్బులు ఇవ్వడం లేదని తెలిపింది. 15 ఏళ్లుగా వచ్చే పెన్షన్ జగన్ కట్ చేశాడని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచేశారని... కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని.. జగన్ పాలనలో డ్వాక్రా యానిమేటర్లు అనేక ఇబ్బందులు పడుతున్నామని.. యువగళం ఏ లక్ష్యంతో చేస్తున్నారని.. టీడీపీ అధికారంలోకి వస్తే మీరు సీఎం అవుతారా అని లోకేశ్‌ను ఓ యువకుడు ప్రశ్నించాడు. టీడీపీ హయాంలో చదువుకునే బాలికలకు సైకిల్స్ అందించారని.. ఇప్పుడు జగన్ ప్రభుత్వం ఆ పథకం ఆపేసిందని యువకుడు తెలిపారు.

**లోకేశ్ మాట్లాడుతూ...** "రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న జగనోరా వైరస్‌కు చంద్రబాబే వ్యాక్సిన్. బాబు అంటే బ్రాండ్... జగన్ అంటే జైలు. కావలి ప్రజలు చూపించిన ప్రేమ ఎప్పటికీ మరవలేను. 150వ రోజు, 2 వేల కిలోమీటర్ల మైలురాయిని కూడా కావలిలోనే పూర్తి చేసుకున్నాను. లోటు బడ్జెట్‌తో రాష్ట్రం విడిపోయినా ఎవరికి లోటు లేకుండా పరిపాలించింది చంద్రబాబు. అన్న క్యాంటీన్, చంద్రన్న భీమా, విదేశీ విద్యలాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది టీడీపీ. అనేక పరిశ్రమలు తీసుకొచ్చి 6 లక్షల మంది యువతకు టీడీపీ హయాంలో ఉద్యోగాలు కల్పించాం. ఒక్క ఛాన్స్ అని ముద్దులు పెట్టగానే ప్రజలు పడిపోయారు. పాలిచ్చే ఆవుని వద్దనుకొని తన్నే దున్నపోతు తెచ్చుకున్నారు. కరెంట్ ఛార్జీలు 9 సార్లు, ఆర్టీసీ ఛార్జీలు మూడు సార్లు, చెత్త పన్ను, ఇంటి పన్ను, పెట్రోల్, డీజిల్ ధరలు, విపరీతంగా జగన్ పాలనలో పెరిగిపోయాయి. జగన్ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కిలో టొమాటో రూ.100, పచ్చిమిర్చి రూ.100, చిక్కుడు రూ.100. పండుగ కానుకలు, విదేశీ విద్య, 27 ఎస్సీ సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశాడు జగన్. బీసీలకు కుర్చీ టేబుల్ లేని కార్పొరేషన్లు ఏర్పాటు చేశాడు జగన్. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ పెంచిన పన్నులు అన్ని తగ్గిస్తాం. పెట్రోల్, డీజిల్ పై పన్ను తగ్గిస్తాం. నేను అంబేద్కర్ రాజ్యాంగం నమ్ముకున్నా. అదే ధైర్యంతో పాదయాత్ర చేస్తున్నాను. జగన్ పాలనలో ప్రజలు భయంతో జీవిస్తున్నారు. భయం పోవాలి అనే ఉద్దేశంతోనే యువగళం పాదయాత్ర మొదలు పెట్టాను. యువగళం మీ గళాన్ని వినిపించడానికి ఒక వేదిక. సక్సెస్‌కు షార్ట్ కట్ లేదు యువత కష్టపడితేనే జీవితంలో విజయం సాధిస్తారు. టీడీపీ హయాంలో వరి రైతులకు పెట్టుబడి రూ.20 వేలు ఉంటే జగన్ పాలనలో రూ.40 అయ్యింది. నెల్లూరు జిల్లాకు చెందిన కోర్టు దొంగ వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయనకి రైతు సమస్యల పై అవగాహన తక్కువ. కల్తీ లిక్కర్‌పై అవగాహన ఎక్కువ. జగన్ పాలనలో కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరి రైతులకు పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర కల్పిస్తాం" అని యువనే చెప్పుకొచ్చారు.

**నేను రాష్ట్రం కోసం పోరాడుతున్నా: యువనేత :** "టీడీపీ హయాంలో రైతులకు రైతు రథాలు, డ్రిప్ ఇరిగేషన్, సూక్ష్మ పోషకాలు, ఇన్పుట్ సబ్సిడీ అందించాం. జగన్ పాలనలో రైతులు అప్పులుపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగాలు లేని యువతకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తాం. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పెండింగ్ పోస్టులు అన్ని భర్తీ చేస్తాం. జగన్ 6 లక్షల పెన్షన్లు రద్దు చేసాడు. గెలిచిన వెంటనే రూ.3 వేల పెన్షన్ ఇస్తానని మోసం చేసాడు. ఇప్పుడు కరెంట్ బిల్లుకి లింక్ పెట్టి పెన్షన్ కట్ చేస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ రద్దు చేసిన 6 లక్షల పెన్షన్ అందిస్తాం. మహిళల సమస్యలు తెలుసుకున్న తర్వాత మహా శక్తి కార్యక్రమం ప్రకటించాం. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తాం. తల్లికి వందనం పేరుతో చదువుకునే పిల్లల కోసం ఏడాదికి రూ.15 వేలు అందిస్తాం. ఇద్దరు పిల్లలు ఉంటే రూ.30 వేలు. దీపం పథకం ద్వారా ప్రతి ఏడాది 3 సిలిండర్లు ఉచితం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. జగన్ పాలనలో కరెంట్ బిల్లు పట్టుకుంటేనే షాక్ కొడుతుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చి విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం. మీ సేవ, అంగన్వాడీ, డ్వాక్రా యనిమేటర్లు, గోపాల మిత్రులు ఇలా అందరినీ జగన్ వేధిస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గౌరవ వేతనం పెంచుతాం. నేను రాష్ట్రం కోసం పోరాడుతున్నాను. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాన్ని గాడిలో పెడతారు. జగన్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాడు. స్కూల్స్ మూసేస్తున్నాడు. టీచర్ల పోస్టులు భర్తీ చెయ్యడం లేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కేజీ నుండి పీజీ విద్యను ప్రక్షాళన చేస్తాం. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చేలా విద్యార్థులను సిద్ధం చేస్తాం. అవసరమైన స్కూల్స్, పెండింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేస్తాం" అంటూ లోకేశ్ హామీ ఇచ్చారు.




# ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం.. ఏడుగురు మృతి

ప్రకాశం జిల్లా: దర్శి సమీపంలోని ఘోర ప్రమాదం జరిగింది. ఎన్ఎస్పీ కాలువలోకి ఆర్టీసీ ఇంద్ర బస్సు దూసుకుపోవడంతో ఏడుగురు మృతిచెందారు. ఈ ఘటనలో మరో 30 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో అబ్దుల్ అజీస్(65), జానీబేగం(65), అబ్దుల్ హనీ(60), నూర్జహాన్(58), షేక్ రమీజ్(48), షబీనా(35), షేక్ హీనా(6) మృతిచెందారు. బస్సు పొదిలి నుంచి కాకినాడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. వివాహ రిసెప్షన్ కోసం కాకినాడ వెళ్లేందుకు పెళ్లి బృందం ఆర్టీసీ బస్సును అద్దెకు తీసుకున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35 నుంచి 40మంది వరకు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులు ఆస్పత్రికి తరలించారు. బస్సు తలకిందులుగా పడటంతో ఒకరిపై ఒకరు పడి ఊపిరాడక 7 మంది మృతి చెందారు. దర్శి డిఎస్పీ అశోక్ వర్దన్, సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఈ ఘటన జరిగినట్లుగా అనుమానిస్తున్నారు. బస్సు ప్రమాద ఘటనాస్థలిని ఎస్పీ మలిక గర్గ్ పరిశీలించారు. ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ప్రమాదం చోటుచేసుకుందని ఎస్పీ తెలిపారు. రాత్రి ఒంటి గంట సమయంలో ప్రమాదం జరిగిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు.

# ప్రకాశం: దర్శి బస్సు ప్రమాద ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి



అమరావతి: ప్రకాశం జిల్లా దర్శి సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పొదిలి నుంచి కాకినాడకు పెళ్లి బృందంతో వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న ఎన్‌సీపీ కాల్వలో పడిపోయింది. ఈ ఘటనలో 7 గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన స్థలానికి పోలీసు సిబ్బంది సహా ఇతర అధికారులు వెళ్లారని, సహాయక చర్యలు చేపట్టారని, క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన విషయాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ ఘటనలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తోడుగా నిలవాలన్నారు.




# నేపాల్‌లో కుప్పకూలిన హెలికాప్టర్.. ఆరుగురి మృతి!


నేపాల్‌లో ఓ ప్రైవేటు హెలికాప్టర్ గల్లంతైన ఘటన విషాదంగా మారింది. ఆ హెలికాప్టర్ కుప్పకూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. అందులో ఐదుగురు మెక్సికన్‌లతో సహా మొత్తం ఆరుగురు ఉన్నారని తెలిపారు. వీరంతా మృతి చెందినట్లు సమాచారం. సోలుకుంభ నుంచి కాఠ్‌మాండూ కు ప్రయాణిస్తుండగా ఎవరెస్టు శిఖరం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు పేర్కొన్నారు. 9ఎన్-ఏఎంవీ కాల్ సైన్‌తో వ్యవహరించే ఈ హెలికాప్టర్ సోలుకుంభులోని సుర్కీ అనే ప్రదేశం నుంచి గాల్లోకి ఎగిరిన 15 నిమిషాల తర్వాత కంట్రోల్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఈ ఘటన మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో చోటు చేసుకొంది. దీనిని సీనియర్ పైలట్ చెట్ గురుంగ్ నడుపుతున్నారు. అతడితోపాటు ఐదుగురు విదేశీయులు కూడా ప్రయాణిస్తున్నారు. ఈ ఘటన చోటు చేసుకొన్న ప్రదేశం ఎవరెస్ట్ శిఖరానికి సమీపంలో ఉంటుంది. ఈ విషయాన్ని నేపాల్ సివిల్ ఏవియేషన్ అధికారి జ్ఞానేంద్ర భుల్ నేపాల్ పత్రికకు వెల్లడించారు. ఆ హెలికాప్టర్లో అమర్చిన జీపీఎస్ సంకేతాలు లమ్జురాపాస్ వద్ద నిలిచిపోయినట్లు ఆయన చెప్పారు. అదే సమయంలో లిఖుపికే రూరల్ మున్సిపాలిటీ ప్రాంతంలో భారీ శబ్దం వినిపించిందని స్థానికులు అధికారులకు సమాచారం అందించారు.

దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న అధికారులు.. హెలికాప్టర్ కుప్పకూలినట్లు గుర్తించారు. పైలట్ చెట్ గురుంగ్‌తో పాటు మరో ఐదుగురు మెక్సికన్‌ల మృతదేహాలనూ ఘటనా ప్రాంతంలో కనుగొన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో రాజధాని కాఠ్‌మాండూ నుంచి కాస్కీ జిల్లాలోని పొఖారాకు వెళ్తోన్న యతి ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో మొత్తం 72 మంది మరణించిన విషయం తెలిసిందే.




దిల్లీ: సవాళ్లను అధిగమించి భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అడుగులు వేస్తోంది. రానున్న 50 ఏళ్లలో భారత జీడీపీ మరింత వేగంగా వృద్ధి నమోదు చేసే అవకాశముందని ప్రముఖ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2075 నాటికి భారత్.. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక శక్తి గా అవతరించనుందని పేర్కొంది. అమెరికాను దాటేసి ఈ ఘనత సాధిస్తుందని తెలిపింది. అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ 52.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని.. చైనా తర్వాతి స్థానంలో ఉంటుందని అంచనా వేసింది. దీనిపై గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్‌కు చెందిన భారత ఆర్థికవేత్త శాంతను సేన్‌గుప్తా మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభా సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి భారత్‌కు కీలక అవకాశాలున్నాయని తెలిపారు. శ్రామిక శక్తిలో భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రతిభ కలిగిన యువతకు శిక్షణ, నైపుణ్యాలను కల్పించడంపై భారత్ దృష్టిపెట్టాలన్నారు. "రానున్న రెండు దశాబ్దాల్లో.. భారత్ ఇతర దేశాలపై ఆధారపడటం మరింత తగ్గుతుంది. తయారీ సామర్థ్యాన్ని, మౌలిక సదుపాయాలు, సేవలను పెంచుకోవడంలో భారత గణనీయమైన వృద్ధిని సాధిస్తుంది" అని గోల్డ్‌మన్ శాక్స్ నివేదిక వెల్లడించింది. "సాంకేతికత, సృజనాత్మకతలో భారత్ ఊహించిన దానికంటే అధిక పురోగతి సాధించింది. అయితే, జీడీపీ వృద్ధికి అదొక్కటే సరిపోదు. జీడీపీ వృద్ధిలో మూలధన పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం భారత్ ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుండటమే గాక.. తలసరి ఆదాయాలు పెరుగుతున్నాయి. ఆర్థిక రంగం వృద్ధి నమోదు చేస్తోంది. ఇవన్నీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి" అని నివేదిక అభిప్రాయపడింది.

# త్రిసభ్య ధర్మాసనానికి ఆర్5 జోన్ కేసుల విచారణ




అమరావతి: రాజధాని అమరావతిలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఆర్5జోన్ అంశంపై ఇవాళ ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. రాజధాని అంశాల కేసులను విడదీసి ఆర్5 జోన్ పిటిషన్లపైనే విచారించాలని ఉన్నత న్యాయస్థానం నిర్ణయించింది. ఈ కేసులకు సబంధించిన విచారణను త్రిసభ్య ధర్మాసనానికి హైకోర్టు అప్పగించింది.

పట్టాల పంపిణీకి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతించిందా? లేదా ఇళ్ల నిర్మాణాలకు అనుమతిచ్చిందా అనేదానిపై స్పష్టత ఇస్తూ వివరాలను తమ ముందు ఉంచాలని ఈ నెల 5న జరిగిన విచారణలో ధర్మాసనం ఆదేశించింది. ఈమేరకు వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మితోపాటు అధికారులకు నోటీసులు జారీ చేసింది. రాజధాని కేసులతో ముడిపెట్టకుండా కేవలం ఆర్5 జోన్ల పిటిషన్లపై విచారణ చెయ్యాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరారు. అందుకు న్యాయమూర్తులు సమ్మతిస్తూ తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.

## తెలుగు రానివారికే ఛాన్సులిస్తారా? ఈషారెబ్బా

తెలుగు హీరోయిన్లకు ఇక్కడ దర్శక-నిర్మాతలు అవకాశాలివ్వడం లేదు! అనడానికి ఎవరి కారణాలు వారికున్నాయి. తాము రాసుకున్న పాత్రలకు సరిపోవడం లేదనో! ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించా లంటే ఇబ్బంది పడతారనో? ఇప్పటికే కొంత మంది మేకర్స్ తమ అభిప్రాయాల్ని షేర్ చేసారు. తెలుగు హీరోయిన్లను పెట్టుకుంటే కొన్ని రకాల ఇబ్బందులుంటాయని మరికొంత మంది దర్శకనిర్మాతలు చెప్పుకొచ్చారు. ఇలా అవకాశాలు ఇవ్వకపోవడం పట్ల ఇప్పటికే పలువురు తెలుగు భామలు అసంతృప్తిని వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. తాజాగా మరో తెలుగు నటి ఈషారెబ్బా కూడా



తన బాధని వ్యక్తం చేసే ప్రయత్నం చేసింది. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ..ప్రస్తుతం మిగతా పరిశ్రమలన్ని తెలుగు పరిశ్రమ గురించే మాట్లాడుకుంటున్నారు. నేను తమిళ..మలయాళ సినిమాల్లో పనిచేస్తున్నప్పుడు కూడా వారంతా టాలీవుడ్ గురించే మాట్లాడుకునేవారు. అలాంటప్పుడు నాకెంతో గర్వంగా అనిపించేది. కానీ ఇక్కడ తెలుగు భాష వచ్చిన వారికంటే రాని వారికే ఎక్కువ అవకాశాలిస్తారన్నది నా అభిప్రాయం. ఇతర రాష్ట్రాల వారిని హీరోయిన్లగా పెట్టుకోవాలని ప్రేక్షకులు దర్శకుల్ని అడగరు. అలాంటప్పుడు వారకే ఎక్కువ అవకాశాలు ఎందుకు ఇవ్వాలి. నేను కేవలం నటీ మణుల గురించి చెప్పట్లేదు. అన్ని పాత్రల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నా అని తన మనోవేదన వ్యక్తం చేసింది. ఈషా కెరీర్ గురించి చూస్తూ అమ్మడు జీవితం అందమైనది అనే సినిమాతో నటిగా పరిచయమైంది. ఆ తర్వాత చాలా చిత్రాల్లో నటించింది. కానీ అరవింద సమేత వీరరాఘవతోనే సరైన గుర్తింపు దక్కింది. ఆ తర్వాత సుబ్రమణ్యపురం..సవ్యసాచి లాంటి చిత్రాల్లో నటించింది. అటుపై రాగల 24 గంటల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. కానీ ఇవేవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. కొన్ని తమిళ.. మలయాళ సినిమాల్లో నూ నటించింది. ప్రస్తుతం మామ మశ్చీంద్రలో నటిస్తోంది. ఇందులో అమ్మడు సుదీర్ బాబు సరసన నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలో గ్లామర్ డోస్ కూడా పెంచింది. ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో ట్రీట్ ఇస్తోంది. ఆ మధ్య ఓ మలయాళ సినిమాలో ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ చెలరేగిన సంగతి తెలిసిందే.

## నీ ఇల్లు బంగారం గాను నా ఒళ్ళు సింగారం గాను!!

ఎన్టీఆర్ గజదొంగ (1981) చిత్రంలోనిది ఈ లిరిక్. వేటూరి సుందరరామ మూర్తి సాహిత్యం అందించగా చక్రవర్తి.కె సంగీతం అందించారు. గానగంధర్వుడు ఎస్పీబాలు - జానకి ఆలపించారు. ఈ క్లాసిక్ సాంగ్ కి రిజంబ్లెన్స్ కనిపిస్తోంది జాన్వీ మేని విరుపుల్లో. జాన్వీ రూపం అలా క్లాసిక్ ని తలపిస్తూ యూత్ కి మతులు చెడగొడుతోంది. మెరుపులు విరుపులతో మెరిసిపోతున్న జాన్వీ కపూర్ నయా లుక్ యూత్ లోకి దూసుకుపోయింది. ఇటీవల వరుసగా బికినీలతో షేక్ చేసిన జాన్వీ ఇప్పుడిలా ప్రయోగాత్మక లుక్ తోనూ మెరిపిస్తోంది. సంథింగ్ స్పెషల్ డిజైనర్ టాప్ తో అదరగొట్టింది. జాన్వీలో హాట్ కంటెంట్ ని ఈ డిజైన్ సరికొత్తగా ఆవిష్కరించిందని చెప్పాలి. దోస్తానా 2 .. గుడ్ లక్ జెర్రీ సహా పలు చిత్రాల్లో జాన్వీ కపూర్ నటిస్తోంది. ఇవన్నీ మునుముందు విడుదలకు సిద్ధం కావాల్సి ఉంది.



**బోయ్ ఫ్రెండ్ మాటేమిటీ?** జాన్వీ కపూర్ ధడక్ సినిమాతో కెరీర్ ప్రారంభించింది. ఈ సినిమా నుంచి జాన్వీ అభిమానుల గుండెల్లో నిలిచిపోయింది. విభిన్న కాన్సెప్టులు ఎంచుకుని వైవిధ్యమైన సినిమాలు చేసే జాన్వీ ప్రేమలో ఉందని కూడా ఇంతకుముందు టాక్ వినిపించింది. తన ఒంటిపై టాటూలలో ఒకటి హెడ్ లైన్స్ లోకి వచ్చింది. సోషల్ మీడియాలో తన వృత్తి జీవితంతో పాటు వ్యక్తిగత జీవితం పరంగానూ ముఖ్యాంశాలలో నిలిచింది జాన్వి. ఇంతకుముందు రిషికేశ్ వెకేషన్ కి వెళ్లిన జాన్వీ ఒంటిపై ఒక సీక్రెట్ టాటూ మెరవడంతో సందేహాలు వ్యక్తమయ్యాయి. తన అభిమానుల కు హింట్ ఇస్తూ.. జాన్వీ టాటూ వేసుకుని తన ఫోటోను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలో జాన్వి తన ముఖానికి మాస్క్ ధరించి కనిపించింది. ఇది మాత్రమే కాదు.. జాన్వీ ముఖంలో చాలా భయం కూడా కనిపించింది. ఈ టాటూ చూసిన అభిమానులు ఈ లబ్బు ఎవరా అని గుసగుసగా చర్చించుకున్నారు. జాన్వీ తన తల్లిని శ్రీదేవి లబ్బు అని పిలిచేది. అంటే తన తల్లి జ్ఞాపకార్థం నటి తన చేతిపై ఈ క్యూట్ టాటూ వేయించుకుందని కూడా కొందరు భావించారు. ఈ పచ్చబొట్టు జాన్వీ అభిమానులలో వైరల్ అయ్యింది. దివంగత నటి శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఇటీవల వరుస పోస్ట్ లను షేర్ చేస్తూ తన అభిమానులతో కనెక్ట్ అవుతూ ఉంది ఈ బ్యూటీ.




## జాన్వీ కాపురంలో అడుగుపెట్టిన హిట్లర్




జాన్వీకపూర్ నటించిన తాజా చిత్రం 'బవాల్' ట్రైలర్ విడుదలైంది. వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాకి నితేష్ తివారీ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ చిత్రం 'బవాల్' ట్రైలర్ ఆదివారం దుబాయ్ లోని గ్లోబల్ ప్రెస్ ఈవెంట్ లో విడుదలైంది. నిజానికి ఈ సినిమా ఈపాటికే థియేటర్లలో విడుదల కావాల్సి ఉన్నా థియేట్రికల్ లాంచ్ ను దాటవేసి జూలై 21న అమెజాన్ ప్రైమ్ వీడియో ఇండియాలో ప్రత్యేకంగా ప్రీమియర్ కి రెడీ అవుతోంది. ఇటీవల విడుదలైన టీజర్ కు భిన్నంగా కొత్తగా ఆవిష్కరించిన ట్రైలర్ కొత్త టోన్ ను ఆవిష్కరించింది. జాన్వీ కపూర్ పాత్ర హృదయాన్ని గెలుచుకోవడానికి ప్రయాణం ప్రారంభించే ఒక చిన్న టౌన్ కుర్రాడిగా వరుణ్ ధావన్ ఈ చిత్రంలో కనిపిస్తున్నాడు. ట్రైలర్ ఆద్యంతం రొటీన్ కి భిన్నమైన వాతావరణంతో సాగుతుంది. విలాసవంతమైన కార్లలో షికార్లు గజిబిజి వాతావరణం ఇందులో ఎక్కడా కనిపించవు. ఈ జంట యూరప్ కు వెళ్లి రెండవ ప్రపంచ యుద్ధంలో జరిగిన సంఘటనలను చూసిన తర్వాత అక్కడ నగరాలను అన్వేషించడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. అడాల్ఫ్ హిట్లర్ కు సంబంధించిన సూచనల నుండి 'లోపల ప్రపంచ యుద్ధం' ప్రస్తావన వరకు చారిత్రక అంశాలను టచ్ చేస్తూ ట్రైలర్ ఆద్యంతం కొత్తగా కనిపిస్తోంది.

**బవాల్ టీజర్ వివాదం** : ట్రైలర్ విడుదలకు ముందు బవాల్ టీజర్ కొన్ని వివాదాలకు కారణమైంది. గ్యాస్ ఛాంబర్స్- నాజీ జర్మనీ - హోలోకాస్ట్ చిత్రాలతో సారూప్యతలను కలిగి ఉందని పలువురు ప్రశ్నించడంతో టీజర్ కొంత వివాదాన్ని సృష్టించింది. దర్శకుడు నితీష్ తివారీ 'హోలోకాస్ట్' ను శృంగారభరితంగా మార్చారని కొందరు విమర్శించగా.. మరికొందరు దర్శకుడిని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బవాల్ ని థియేటర్లలో పూర్తిగా చూసే వరకు తీర్పును రిజర్వ్ చేయాలని పలువురు సూచించారు. వరుణ్-జాన్వీల బవాల్ ప్రచారవైవిధ్యం ఆకట్టుకుంటోంది. ఈఫిల్ టవర్ లో ప్రీమియర్ అయిన తొలి భారతీయ చిత్రంగా బవాల్ నిలిచింది. నదియాద్వాలా గ్రాండ్ సన్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై సాజిద్ నడియాడ్ వాలా నిర్మించిన ఈ చిత్రం ప్రపంచ ఆకర్షణతో భారతదేశ సంస్కృతి అందానికి సంబంధించిన సారాంశాన్ని మిళితం చేసే ఒక ఛమత్కార ప్రయాణంలోకి వీక్షకులను తీసుకువెళుతుంది. ఎర్త్ స్కై పిక్చర్స్ పై సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న నితేష్ తివారీ ఆకట్టుకునే కథాంశం.. అద్భుతమైన విజువల్స్ .. వరుణ్ ధావన్ %a% జాన్వీ కపూర్ మధ్య అందమైన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీని అద్భుతంగా తెరపైకి తెచ్చారు. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రపంచవ్యాప్త ప్రీమియర్ కి బవాల్ సిద్ధమవుతోంది.

## శ్రీముఖి.. వ్వాటే థైస్ షో!





తెలుగు టెలివిజన్ ప్రపంచంలో గ్లామరస్ బ్యూటీగా మంచి క్రేజ్ అందుకున్న వారిలో శ్రీముఖి ఒకరు. ఒకవైపు అనసూయ రష్మీ వంటి టాప్ యాంకర్స్ నుంచి పోటీ ఎదురవుతున్నప్పటికీ కూడా శ్రీముఖి తనకంటూ ఒక ప్రత్యేకమైన స్టార్ ఇమేజ్ తో ముందుకు సాగుతోంది. ఇక కేవలం రియాలిటీ షో లతో మాత్రమే కాకుండా శ్రీముఖి సోషల్ మీడియా ద్వారా కూడా మంచి క్రేజ్ అందుకుంటుంది. ఇక అవసరమైన సమయంలో మంచి ఆఫర్లు వస్తే సినిమాల్లో కూడా నటిస్తోంది. అయితే అప్పుడప్పుడు అమ్మడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న ఫోటోలు మాత్రం ఊహించిన విధంగా ఉంటున్నాయి. రీసెంట్ గా లిఫ్టులో ఒక ఫోటో షూట్ చేసిన శ్రీముఖి గ్లామర్ షో తో ఊహించని విధంగా కనిపించింది. అమ్మడు మెరిసే డ్రస్సులో చాలా అందంగా స్టిల్స్ అయితే ఇచ్చింది. అంతేకాకుండా లెగ్స్ అందాలతో కూడా శ్రీముఖి మరోసారి ఎంతగానో ఆకట్టుకుంది.

గతంలో పొట్టి డ్రెస్ లలో శ్రీముఖి చాలాసార్లు దర్శనమిచ్చింది. కానీ ఈసారి మాత్రం అంతకంటే భిన్నంగా స్టిల్స్ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ఆ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇక శ్రీముఖి బుల్లితెరపై బాగానే బిజీ అవుతున్నప్పటికీ వెండితెరపై మాత్రం గతంలో మాదిరిగా ఆఫర్లు అయితే అందుకోవడం లేదు. జులాయి సినిమాలో అల్లు అర్జున్ సిస్టర్ గా కనిపించిన శ్రీముఖి ఆ తర్వాత వెంట వెంటనే కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా సైడ్ పాత్రలలో బాగానే నటించింది. అంతేకాకుండా ఆ మధ్యలో లీడ్ రోల్స్ చేసే అవకాశం కూడా అందుకుంది. కానీ ఆ సినిమాలేవి కూడా అంతగా వర్కౌట్ కాలేదు. ఇక శ్రీముఖి ప్రస్తుతం గ్లామర్ స్టిల్స్ తో ఎంతగానో ఆకట్టుకుంటోంది. దీంతో ఆమె ఇలాంటి పాత్రలలో కూడా నటించడానికి వెనుకడుగు వేయదు అని అనిపిస్తోంది. మరి రాబోయే రోజుల్లో శ్రీముఖి వెండి తెరపై ఏదైనా మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో లేదో చూడాలి.

## గుంటూరు కారం.. పూజాతో సెటిల్మెంట్?

త్రివిక్రమ్ శ్రీనివాస్ ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరో గా గుంటూరు కారం మూవీ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. భారీ బడ్జెట్ తో హారిక అండ్ హాసి ని క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం లో శ్రీలీల మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకొని మూవీ షూటింగ్ చేస్తున్నారు. నిజానికి గుంటూరు కారం సినిమా లో మొదటిగా పూజా హెగ్డేని హీరోయిన్ పాత్ర కోసం ఎంపిక చేశారు. అయితే కథలో మార్పులు చేయడంతో పాటు పూజా హెగ్డేని మెయిన్ లీడ్ నుంచి తొలగించారు. ఆమె స్థానం లో శ్రీలీల లీడ్ రోల్ లో తీసుకున్నారు. అయితే ఈ చిత్రం కోసం ముందుగానే పూజా హెగ్డేకి అడ్వాన్స్ కూడా



ఇవ్వడం జరిగింది. అయితే ఒక మూవీ కోసం అడ్వాన్స్ ఇచ్చిన తర్వాత తిరిగి తీసుకోకపోవడం అనేది అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో గుంటూరు కారం సినిమా లో హీరోయిన్ గా పూజా హెగ్డేని తప్పించిన ఆమెకి ఇచ్చిన అడ్వాన్స్ కి సరిపోయే విధంగా ఓ ప్రత్యేక గీతం కోసం మళ్ళీ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐటెం సాంగ్ కోసం ఆమె ఎంపిక ఖరారైనట్లే అని టాక్ వినిపిస్తోంది. పూజా హెగ్డే గతం లో రంగస్థలం సినిమా లో ఐటెం సాంగ్ లో మెరిసింది. ఈ నేపథ్యంలో గుంటూరు కారం సినిమా లో కూడా ప్రత్యేక గీతం లో నటించడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని టాక్ వినిపిస్తోంది. ఒక వేళ పూజా హెగ్డే కూడా ఈ సినిమా లో స్పెషల్ సాంగ్ లో చేస్తే మాత్రం కచ్చితంగా అది ఆమె కెరియర్ లో చాలా స్పెషల్ అవుతుంది. హీరోయిన్ గా తప్పుకున్న సినిమా లోనే ఐటెం సాంగ్ చేసిన హీరోయిన్ గా పూజా హెగ్డే పేరు నిలిచిపోతుంది. మరి ఇది ఎంత వరకు వాస్తవమనేది తెలియాలంటే అధికారికంగా ప్రకటించే వరకు వెయిట్ చేయాల్సిందే.

## పాపం రకుల్ కి ఆటంకం?

దక్షిణాదిన రాణించాక హిందీ సినీపరిశ్రమలో అవకాశం చేజిక్కించుకోవడం చాలా సులువు. అదే కోవలో ఇంతకుముందు పలువురు దక్షిణాది అగ్ర కథానాయికలు ఉత్తరాదినా ఓ వెలుగు వెలిగారు. వీళ్లలో అశిన్ - త్రిష సహా చాలా మంది కథానాయికలు ఉన్నారు. కానీ సుదీర్ఘ కాలం కెరీర్ ని సాగించింది మాత్రం చాలా తక్కువ మంది. ఇటీవలి కాలంలో నవతరం భామలు కూడా బాలీవుడ్ లో అవకాశాలు అందుకుంటున్నారు. కొన్ని వెబ్ సిరీస్ లు సినిమాలు చేస్తూ కెరీర్ బండిని సాగిస్తున్నారు. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ వంతు. గత కొన్నేళ్లుగా రకుల్ పూర్తిగా ముంబై పరిశ్రమపైనే దృష్టి సారించింది. తెలుగులో నటిస్తున్నా కానీ తన మనసు మాత్రం బాలీవుడ్ వైపే ఉందన్నది సుస్పష్టం. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం ఎలానో ఈ ఉత్తరాది బ్యూటీకి స్పష్టంగా తెలుసు. అయితే తనకి ఇప్పటివరకూ అదృష్టం కలిసి రాలేదు. నటించిన



సినిమాల్లో దేదే ప్యార్ దే మినహా ఇతర సినిమాలేవీ హిట్ కాలేదు. దేదే వల్ల కూడా తనకు పెద్దగా కలిసొచ్చిందేమీ లేదు. ఇప్పుడు ఎటాక్ చిత్రంతో థియేటర్లలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. జాన్ అబ్రహాం లాంటి కండరగండడు ఇందులో హీరో. సైన్స్ ఫిక్షన్ కలగలిసిన మిలటరీ బ్యాక్ డ్రాప్ తో వస్తోంది. ఎటాక్ వెండితెరపైకి రానుంది. ఆ తర్వాత అజయ్ దేవగన్ తో రన్ వే 34 కూడా వస్తుంది. మిషన్ సిండ్రెల్లా-డాక్టర్ జి - థ్యాంక్యూ గాడ్ సహా తమిళ చిత్రం అయలాన్ -ఛత్రివాలి.. ఇంత పెద్ద క్యూ రకుల్ కి ఉంది. అన్నీ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. రకుల్ ప్రీత్ తన వ్యక్తిగత.. వృత్తిపరమైన జీవితాలను గురించి తాజాగా జాతీయ మీడియాతో ముచ్చటించింది. ఎటాక్ రిలీజవుతున్నా ఆర్.ఆర్.ఆర్ తో చిక్కులు తప్పవన్న భావన అందరిలో ఉంది. రకుల్ ఎటాక్ విజయం సాధిస్తుందా లేదా? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటన్నిటికీ రకుల్ సమాధానం ఇక్కడ ఉంది. 2022 భారీ లైనప్ తో తనకు కలిసి రానుందని రకుల్ వాస్తవికంగా ఆశాభావం వ్యక్తం చేసింది. కోవిడ్ కేసుల సంఖ్య నియంత్రణలో ఉండటంతో థియేటర్ లు పూర్తి స్థాయికి తెరిచారు. అనేక సినిమాలు వాటి థియేట్రికల్ విడుదల తేదీలను లాక్ చేశాయి. ఇదే విషయమై రకుల్ మాట్లాడుతూ.. "నేను చాలా సం తోషంగా ఉన్నాను. ఇప్పుడు కోవిడ్ వచ్చి 2 సంవత్సరాలు అయ్యింది. నా చివరి చిత్రం కొంత కాలం క్రితం విడుదలైనందున నా సినిమాలు రిలీజ్ కి రావాలని నేను చాలా ఎదురు చూస్తున్నాను. థియేటర్లలో దే దే ప్యార్ దే- విజయం దక్కించుకుంది. సర్దార్ నెట్ ఫ్లిక్స్ లో వచ్చింది. థియేటర్ లోని ఆ శక్తిని చూసేందుకు ప్రజలు మనం చేసిన పనిని చూసేందుకు ఇకపై వస్తారు. నిజానికి మొదటి లాక్ డౌన్ లో నేను అంతా ప్రశాంతంగా ఉన్నాను. ప్రజలు కృతజ్ఞతతో ఉండాలని కోరాను. రెండవ లాక్ డౌన్ నేను కూడా భయపడ్డాను. ఇది పర్వాలేదు.. కానీ చాలా చెడ్డది. మీరు ఆరోగ్యంగా ఉన్నందుకు దేవునికి ధన్యవాదాలు అని తెలిపాను.




హైదరాబాద్: రైతులకు ఉచిత విద్యుత్ రద్దు చేయాలని కాంగ్రెస్ దుర్మార్గపు ఆలోచన చేస్తోందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. గతంలోనూ రైతులకు విద్యుత్ ఇవ్వకుండా గోసపెట్టారని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ మరోసారి బయటపెట్టిందన్నారు. కాంగ్రెస్ ఆలోచనల్ని తెలంగాణ రైతులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక ఆలోచనా విధానాలపై ఇవాళ, రేపు భారాస నిరసనలకు పిలుపునిచ్చింది. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలు దహనం చేయాలని కోరింది.

**హిమాచల్‌లో విద్యార్థుల గల్లంతుపై కేటీఆర్ స్పందన :** హిమాచల్‌ప్రదేశ్‌లో తెలుగు విద్యార్థులు చిక్కుకోవడంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. కులు, మనాలిలో విద్యార్థులు చిక్కుకున్నట్లు తనకు బాధితుల తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. వెంటనే దిల్లీలోని రెసిడెంట్ కమిషన్‌ను అప్రమత్తం చేశామన్నారు.

బాధిత విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు చెప్పారు. సహాయం కోసం టీఎస్ భవన్, కేటీఆర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వొద్దు.. 3 గంటలు ఇస్తే చాలు: రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



రైతులకు నిరంతరాయ ఉచిత కరెంట్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ అవసరం లేదని.. 3 గంటలు ఇస్తే చాలని వ్యాఖ్యానించారు. కాగా అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్.. సోమవారం తానా మహాసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తానా ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం ఎన్ఆర్ఐలు, పలు మీడియా వ్యక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ఓ ఎన్ఆర్ఐ రేవంత్‌ను ఆసక్తికర ప్రశ్న వేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు నిరాంతరాయంగా అందుతున్న కరెంట్‌ను, దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా అని ప్రశ్నించారు. దీనిపై రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో 95శాతం మంది రైతులు మూడెకరాల లోపున్న చిన్న, సన్నకారు రైతులేనని తెలిపారు. ఒక ఎకరాకు సాగు నీరు పారించాలంటే ఒక గంట సరిపోతుందని, అదే మూడు ఎకరాలకు ఫుల్లుగా నీళ్లు పట్టాలంటే మూడు గంటలు చాలని వ్యాఖ్యానించారు. మొత్తం మీద ఒక రైతుకు ఎనిమిది గంటలు ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందని పేర్కొన్నారు. కేవలం విద్యుత్ సంస్థల వద్ద కమీషన్‌కు కక్కుర్తి పడి వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంట్ అనే నినాదాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ఉచిత కరెంట్ పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నాడని, ఉచితాన్ని మన స్వార్థానికి వాడుకోవద్దని అన్నారు.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కోమటిరెడ్డి




హైదరాబాద్: రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు తనను బాధించాయని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ వద్దన్న రేవంత్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. 24 గంటల పాటు ఉచిత కరెంట్ ఇచ్చి తీరుతామని, తమ మేనిఫెస్టోలో కూడా పెడతామని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. 'చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాడు. వైఎస్సార్ ప్రతిపక్ష నేతగా 24 గంటలు ఇస్తానని ప్రకటించి సంచలన నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచి అప్పట్లో చంద్రబాబు రైతులను కాల్చి చంపారు. రైతులకు అండగా నిలిచి వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇచ్చారు" అని కోమటిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు సరికావు. సీతక్కను సీఎం చేస్తానన్న వ్యాఖ్యలు కూడా సరికావు. రేవంత్‌రెడ్డి చెప్పిన వ్యాఖ్యలు ఏవీ ఫైనల్ కావు. పీసీసీ అధ్యక్షుడి పదవి చాలా చిన్న పోస్ట్. ఉచిత విద్యుత్‌పై నిర్ణయం తీసుకునే అధికారం రేవంత్‌కు లేదన్న కోమటిరెడ్డి.. ఆ వ్యాఖ్యలపై క్లారిటీ ఇవ్వాలి" అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. "రేవంత్ వ్యాఖ్యలపై సీఎల్పీ నేతతో చర్చించాను. అవసరమైతే అధిష్టానానికి కూడా ఫిర్యాదు చేస్తాం. అమెరికా వెళ్లిన రెండురోజుల్లో రేవంత్ ఎందుకింత గందరగోళంగా మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డిపై బాలకృష్ణ ప్రభావం పడిందా?" అంటూ కోమటిరెడ్డి వ్యంగంగా మాట్లాడారు.

## పార్టీ మారినా మనిషి మారలేదు.. మనసూ కరగ లేదు.. రేవంత్‌పై హరీష్ ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్: ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. "ధరణి వద్దు..రైతు బంధు వద్దు.. ఉచిత కరెంటు వద్దు..!" అంటూ వ్యాఖ్యలు చేశారు. రైతన్న సంక్షేమం కోసం ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేసీఆర్ పాలనలో రైతులకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అధికారంలోకి వస్తే అందకుండా చేస్తామంటూ అడ్డగోలుగా మాట్లాతున్నారని మండిపడ్డారు. నాడు తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన మనిషే, నేడు పచ్చ బడ్డ తెలంగాణను చూసి విషం చిమ్ముతున్నారని విమర్శించారు.

పార్టీ మారినా మనిషి మారలేదు.. మనసు కరగ లేదన్నారు. పైశాచికత్వంతో తెలంగాణ సమాజంపై పగబట్టినట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ అధ్యక్షుడికి రైతులు తగిన శాస్తి చేయాలని పిలుపునిచ్చారు. రైతన్నకు కరెంట్ వద్దన్న కాంగ్రెస్ నాయకులకు వచ్చే ఎన్నికల్లో కరెంట్ షాక్ ఇవ్వాలని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారు..



హైదరాబాద్: రైతులకు ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెనుదుమారాన్ని సృష్టిస్తున్న నేపథ్యంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించి మాట్లాడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే రైతులు .. రైతులు అంటేనే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. దేశంలో రైతులకు అనుకూలంగా పనిచేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ మంత్రులంతా ఊర కుక్కల్లా మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్యుత్ కొనుగోలులో జరిగిన అవినీతిపై రేవంత్ మాట్లాడితే వక్రీకరిస్తున్నారని అన్నారు. విద్యుత్ కొనుగోలులో అవినీతిపై బహిరంగ చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తారా అని అన్నారు. కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్ఎస్‌లో వణుకుపుడుతోందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వటమే కాంగ్రెస్ ఎజెండా అని తేల్చిచెప్పారు. రైతులకు అన్ని పంటలకు మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తుచేశారు.

రుణమాఫీ చేయని కేసీఆర్ సర్కార్‌కు రైతుల గురించి మాట్లాడే నైతికత ఎక్కడిదని ప్రశ్నించారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు మద్దతు ఇచ్చిన కేసీఆర్ సర్కార్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని పొన్నం ప్రభాకర్ నిలదీశారు.

## తెలంగాణలో చంద్రబాబు వారసుల నాయకత్వం.. రేవంత్‌పై జగదీష్ ఫైర్

హైదారాబాద్: రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. రేవంత్‌పై మంత్రులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తాజాగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు వారసుల నాయకత్వం ఇంకా తెలంగాణలో కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రైతులకు శాశ్వత విముక్తి లభించిందని అందరూ అనుకున్నారని.. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రూపంలో తెలంగాణ రైతులకు నెత్తిన పిడుగు పడిందంటూ వ్యాఖ్యలు చేశారు. ఉచిత కరెంట్ ఇస్తే నష్టం జరుగుతుందని చంద్రబాబు, ఆయన వారసులు చెప్పే మాటలు అని.. రైతులపై రేవంత్ తన నైజాన్ని బయట పెట్టారని మండిపడ్డారు.

వ్యవసాయ రంగాన్ని నాశనం చేసింది కాంగ్రెస్ అని అన్నారు. వైఎస్ హయాంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రేవంత్ ధర్నాలు చేశారని మంత్రి గుర్తుచేశారు. 24 గంటల విద్యుత్ రైతులకు ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. రైతులకు విద్యుత్ ఇస్తే మీకెందుకు ఏడుపు... కక్ష అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు నుంచి రైతు వ్యతిరేక మాటలు ఎందుకు వస్తున్నాయని నిలదీశారు. కాంగ్రెస్ జెండా పట్టుకున్న రైతులు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. బషీర్‌బాగ్‌లో రైతులు చచ్చిపోయింది మూడు గంటల కరెంట్ కోసమా అని అడిగారు. తెలంగాణ రైతులు మళ్ళీ తూటాలకు బలి కావాలా అంటూ నిలదీశారు. రేవంత్ ఇంట్లో 24 గంటల కరెంట్ ఉండాలని... రైతులకు మాత్రం ఇవ్వొద్దా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగమే రేవంత్ వ్యాఖ్యలు అంటూ విరుచుకుపడ్డారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున నిరసన తప్పదని హెచ్చరించారు. ఎవరు ఎవరితో టచ్‌లో ఉన్నారో తమకు తెలియదని.. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.



## సీఎం అభ్యర్థి సీతక్క అయితే.. తెలంగాణ సీన్ లో భారీ ఛేంజ్?

హైదరాబాద్ : కొన్నిసందర్భాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటూ ఉంటాయి. తాజాగా అలాంటిదే ఒకటి అనుకోకుండా తెర మీదకు వచ్చింది. మరో నాలుగు నెలల వ్యవధి లో తెలంగాణ రాష్ట్రానికి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశాలు మెండుగా ఉన్నాయన్న ప్రచారం జోరు గా సాగుతున్న సంగతి తెలిసిందే. తమకు తాము.. అధికారం లోకి వచ్చేసినట్లే అంటూ కాంగ్రెస్ నేతలు జబ్బలు చరుచుకుంటూ ఉంటే.. అందుకు భిన్నంగా గులాబీ నేతలు మాత్రం ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. గులాబీ బాస్ అయితే.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఎన్నికల్లో విజయానికి కావాల్సిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. అనూహ్యంగా రేవంత్ నోటి నుంచి వచ్చిన..'సీఎంగా సీతక్క' మాట తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎందుకంటే.. ఈ తరం రాజకీయాల్లో అందినకాడికి దోచుకోవటం.. దాచుకోవటం.. వేలాది కోట్లు వెనకేసుకోవటం లాంటి పనులు చేస్తున్న నేతల కు భిన్నంగా.. సేవా భావం తో వ్యవహరిస్తూ.. అనునిత్యం ప్రజల కు అందుబాటు లో ఉండటమే కాదు.. ఆడంబర జీవితానికి భిన్నంగా.. ఆదర్శవంతంగా వ్యవహరిస్తున్న రాజకీయ నేతల్లో సీతక్క ముందుంటారు. ఇన్నేళ్లుగా రాజకీయాల్లో ఉండి కూడా ఒక్కటంటే ఒక్క విమర్శ.. ఆరోపణలు ఎదుర్కొని రాజకీయ నేతలు అరుదు గా ఉంటారు. ఆ కోవలోకే సీతక్క రావటం.. ఆమె సీఎం అభ్యర్థిగా ఫోకస్ అయితే.. తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటు చేసుకోవటం ఖాయమంటున్నారు. నిరాడంబరంగా ఉండే ఈ తరం రాజకీయనేతలు అరుదుగా కనిపిస్తారు. వరదలు ముంచెత్తినా కాళ్లకు చెప్పుల్లేకుండా కొండ కోనల్లో ఉండే గిరిజనుల కు ఆహార పదార్థాలు అందించే ఆమెకు చెందిన పలు వీడియోలు సోషల్ మీడియా లో వైరల్ అవుతూ ఉంటాయి. నిస్వార్థంగా వ్యవహరించే సీతక్క అంటే.. పార్టీల కు అతీతంగా రాజకీయ వర్గాల్లో ఆమె మీద ప్రత్యేక అభిమానమే కాదు.. సానుకూల వైఖరి కూడా కనిపిస్తూ ఉంటుంది. సీఎం కేసీఆర్ కు ధీటైన నేత ను చూసినప్పుడు.. అందరూ తేలిపోయే పరిస్థితి. అందుకు భిన్నంగా గుణంలోనూ.. శ్రమించే తీరులోనూ.. ఆదర్శవంతమైన రాజకీయ నేతగా కేసీఆర్ కంటే సీతక్క ముందు ఉంటారన్నది పలువురి వాదన.ప్రజా జీవితం లో ఉన్నప్పుడు విమర్శల కు గురి కావటం.. ఆరోపణలు ఎదుర్కోవటం.. సంపన్నులుగా మారటం లాంటివి మామూలుగా జరిగిపోతుంటాయి. కానీ.. వాటికి దూరంగా ఉండే సీతక్క.. తనను ఎన్నుకున్న ప్రజల కు అందుబాటు లో ఉండాలన్న తపనే ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. గత ఎన్నికల్నిచూస్తే.. గిరిజనులు అధికంగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో.. గిరిజనుల ఓట్ల కోసం ఓవైపు బీజేపీ పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి వేళలో అనూహ్యంగా సీఎం అభ్యర్థిగా సీతక్క పేరు తెర మీదకు రావటంతో.. ఆమెకు మించిన ఉత్తమ ఆప్షన్ మరొకటి ఉండదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే.. ఈ ప్రచారం భట్టి వర్గీయుల కు మింగుడుపడని రీతి లో మారిందంటున్నారు. సీతక్క ను సీఎం గా చేస్తే.. తెలంగాణ లో తొలి మహిళా ముఖ్యమంత్రిగా.. తొలి గిరిజన నేతగా.. తొలి మాజీ మావోయిస్టుగా ఆమె చరిత్రను సృష్టించే వీలుందన్న మాట వినిపిస్తోంది. ఆదర్శాలు వల్లించే ప్రజలు.. ఆదర్శవంతమైన నేతల్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ఉంది. మరి.. సీతక్క విషయం లో ఏం జరుగుతుందో చూడాలి. ఏమైనా.. రేవంత్ నోటి నుంచి వచ్చిన సీఎం అభ్యర్థి సీతక్క మాట తెలంగాణ రాజకీయ సమీకరణాల్ని మొత్తంగా మార్చే అవకాశం ఉందన్న మాట బలంగా వినిపిస్తోంది.

## రేవంత్ నోట 'రామా' అన్న బూతు అయిపోతుందా?



హైదరాబాద్ : తెలంగాణ పీసీసీ చీఫ్ గా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి నోటి నుంచి వచ్చే మాటల్ని అదే పనిగా వక్రీకరించే పని జరుగుతోందా? ఆయన రామా అన్నా బూతులా ప్రచారం చేయటం.. ప్రతి మాట కు అసలు అర్థం ఇదేనంటూ పెడార్థాలు తీస్తున్న ధోరణి వెనుక ఉన్నదెవరు? అన్నదిప్పుడు చర్చగా మారింది. తన మాటల తో కేసీఆర్ సర్కారు ను ఇరుకున పెట్టే రేవంత్ రెడ్డి.. తాజాగా చెప్పిందేంటి? జరుగుతున్న ప్రచారం ఏమిటి? అన్నది చూస్తే విషయం ఇట్టే అర్థమవుతుంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన లో ఉన్నారు. అక్కడ జరుగుతున్న తానా సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఎన్నారై లతో సమావేశమైన రేవంత్ ను పలువురు ఎన్నారైలు ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఒకరు అడిగిన ప్రశ్నకు రేవంత్ చెప్పిన సమాధానం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారటంతో పాటు.. హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ లో 18 శాతం గా ఉన్న ఎస్సీల నుంచి సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఫోకస్ చేస్తున్నారు. మరి.. 12 శాతం గా ఉన్న ఎస్టీల నుంచి సీతక్క ను ఉప ముఖ్యమంత్రిగా ఫోకస్ చేస్తారా? అని ప్రశ్నించారు. దీనికి బదులిచ్చిన రేవంత్.. 'మీరు కాంగ్రెస్ పార్టీ బిగ్ పిక్చర్ చూడట్లేదు. 53 ఏళ్లుగా ప్రజా జీవితం లో ఉన్న దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడి గా పార్టీ చేసింది. దేశం లో కాంగ్రెస్ పార్టీ నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే.. అందులో మూడు చోట్ల ముఖ్యమంత్రులు ఓబీసీలే. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ఎన్నికల కు ముందు ప్రకటించటం కాంగ్రెస్ సంప్రదాయం కాదు. ఎన్నారైలు ఇచ్చిన సూచనపై పార్టీలో అంతర్గతంగా చర్చించుకుంటాం. మీరు సీతక్కకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారా? అని అడిగారు కదా. ఆ సందర్భం వస్తే అక్కను సీఎం గా కూడా చేయొచ్చు' అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేసు లో ఉన్న రేవంత్ నోటి నుంచి సీతక్క పేరు తో చేసిన వ్యాఖ్య రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. అదే సమయం లో.. రేవంత్ వ్యాఖ్యల్ని వక్రీకరిస్తూ సోషల్ మీడియా లో ప్రచారం షురూ అయ్యింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా భట్టి ఫోకస్ అవుతున్న వేళ.. ఆయన్నుదెబ్బేసి.. కొత్త సమీకరణాల్లో భాగం గా సీతక్క పేరును ప్రస్తావించినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే.. ఎన్నారైలు అడిగిన ప్రశ్న.. అందుకు రేవంత్ చెప్పిన సమాధానం సూటి గా.. స్పష్టంగా ఉంది. అయినప్పటికీ.. అందుకు భిన్నంగా జరుగుతున్న ప్రచారం చూస్తే.. రేవంత్ నోటి నుంచి వచ్చే ప్రతి మాటకు తప్పుడు అర్థం లో ప్రచారం చేసే వారి సంఖ్య అధికంగా ఉందా? అన్న అనుమానం వ్యక్తమయ్యేలా పరిస్థితులు ఉంటున్నాయి.

## గవర్నర్ కు షాకిచ్చిన హైదరాబాద్ ట్రాఫిక్



హైదరాబాద్ : నిత్యం లక్షలాది మందికి చుక్కలు చూపించే హైదరాబాద్ ట్రాఫిక్.. తాజాగా రాష్ట్ర ప్రథముడికి షాకిచ్చింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సైకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. గవర్నర్ అధికారిక నివాసం.. రాజ్ భవన్ కు కూతవేటులో ఉండే ఖైరతాబాద్ హనుమాన్ టెంపుల్ కు వచ్చిన సందర్భంగా ఆమె ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. గవర్నర్ గా పని చేసే వారంతా.. రాజ్ భవన్ కు అతి సమీపంగా ఉండే.. ఖైరతాబాద్ కూడలిలోని హనుమాన్ టెంపుల్ కు వెళ్లటం ఆనవాయితీగా వస్తోంది. తమిళ సైకు ముందు గవర్నర్ గా పని చేసిన నరసింహన్ అయితే.. ఈ హనుమాన్ టెంపుల్ కు రెండు రోజులకు ఒకసారి వెళ్లేవారు. ఆయన ఆ గుడికి వెళ్లే వేళలో.. ట్రాఫిక్ ను నిలిపివేసేవారు. కాకుంటే.. ఆయన ఎక్కువగా తెల్లవారుజాము ప్రాంతంలో వెళ్లటం.. తాను వెళ్లే సమయంలో ట్రాఫిక్ మొత్తాన్ని నిలిపివేయించేవారు. దీంతో.. వాహనదారులు ఎక్కువగా ఇబ్బంది పడేవారు. సాధారణంగా ప్రముఖులు.. అందునా గవర్నర్ స్థాయి వారు.. ఒక దేవాలయానికి వెళితే.. ట్రాఫిక్ నిలిపివేయటం మామూలే. కాకుంటే.. వారంలో మూడు.. నాలుగు సార్లు గుడికి వెళ్లటంతో అటు ట్రాఫిక్ పోలీసులకు.. ఇటు ప్రోటోకాల్ సిబ్బందితో పాటు ప్రజలు తరచూ ఇబ్బందులకు గురయ్యేవారు. ఆయన తీరుపై కొంత విమర్శలు వచ్చినా పెద్దగా పట్టించుకున్నది లేదు. కట్ చేస్తే.. తాజాగా గవర్నర్ తమిళ సై.. సాయంత్ర వేళలో హనుమాన్ టెంపుల్ కు వచ్చారు. అయితే.. ప్రత్యేకంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించకపోవటంతో.. గుడి నుంచి రాజ్ భవన్ కు తిరిగి వెళ్లే సమయంలో ఆమె ట్రాఫిక్ లో ఇరుక్కుపోయారు. దీంతో.. ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఎర్రమంజిల్ నుంచి ఖైరతాబాద్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం.. యూ టర్నర్ కోసం గవర్నర్ వాహనం వేచి చూడాల్సి వచ్చింది. ట్రాఫిక్ పోలీసుల సమన్వయ లోపమని చెబుతున్నా.. తాను రోడ్డు మీద వెళ్లే వేళలో ట్రాఫిక్ ను నిలిపివేయాల్సిన అవసరం లేదన్న గవర్నర్ తీరుతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ట్రాఫిక్ లో గవర్నర్ వాహనం నిలిచిపోవటంతో.. ఆమె భద్రతా సిబ్బంది హైరానా పడ్డారు. భద్రతా సిబ్బంది కార్లు దిగి.. వాహనాల్ని ఆపి.. అప్పటికప్పుడు ఆమె ఉన్న వాహనాల కాన్వాయ్ ముందుకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. మొత్తంగా రాష్ట్ర గవర్నర్ హైదరాబాద్ ట్రాఫిక్ లో ఇరుక్కుపోవటం షాకింగ్ గా మారింది.

## తెలంగాణ రైతులపై రేవంత్ రెడ్డికి కండ్ల మంట: మంత్రి ఇంద్రకరణ్

హైదరాబాద్: వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతుల ఆర్థిక పురోభివృద్ధి నచ్చని రేవంత్ రెడ్డికి ఎంత కండ్ల మంట ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు కొండంత అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుల పొట్టగొట్టేందుకు చూస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో కరెంటు లేక రైతులు అరిగోసపడ్డారని, స్వరాష్ట్రంలో పుష్కలంగా సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరాతో ఆర్థికంగా ఎదుగుతున్న రైతులను మళ్లీ చీకట్లోకి నెట్టేసే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారని హెచ్చరించారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు రైతులంటే చిన్నచూపని, మొన్న ధరణి వద్దన్నారని, ఇప్పుడు వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరఫరా సరిపోతుందని చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే.. కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని అర్థమవుతుందని వ్యాఖ్యనించారు. ఇప్పుడు ధరణి వద్దని, వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలన్న రేవంత్ రెడ్డి.. రేపు రైతుబంధు, రైతు బీమా కూడా వద్దంటారని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పి బంగాళఖాతంలో కలపాలని తెలంగాణ రైతాంగానికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా ఇవాళ, రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం, ప్రజలకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com